RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక

CITIZEN TIMES TELUGU DAILY

VOLUME: 16 | ISSUE: 40 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 6-9-2025 | Pages: 8 | Rs: 2/-

సంపుటి : 16 | సంచిక : 40 | ఎడిటర్ : కంచర్ల సందీప్ కుమార్ | విశాఖపట్నం 6-9-2025 | పేజీలు : 8 | రూ: 2/-



# పిల్లల బాధ్యత మీది.. మీ బాధ్యత నాది

### గురుపూజోత్సవంలో ఉపాధ్యాయులతో ముఖ్యమంత్రి చంద్రబాబు

### నాడు అధ్యాపక ఉద్యోగం వద్దన్నా.. -ఎమ్మెల్యే అవుతానని చెప్పా

### నేర్చుకున్నవి ప్రజలకు ఎలా ఉపయోగపడతాయని ఆలోచిస్తానన్న సీఎం




**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ప్రతి ఒక్క ఉపాధ్యాయుడూ సామాజిక మాధ్యమ ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ఇందులో పూర్వ విద్యార్థులు, స్థానికులను భాగస్వాముల్ని చేయాలి. అప్పుడు పాఠశాలకు అవసరమైన నిధులొస్తాయి. విజ్ఞానం వస్తుంది. పూర్వ విద్యార్థుల అనుభవాలను పిల్లలకు చెప్పించాలి. ఉపాధ్యాయ నియామకాల్లో ఎప్పుడూ ఆలస్యం చేయను. మొదటి సంతకం మెగా డీఎస్సీ దస్త్రంపైనే పెడతానని మాటిచ్చి నిలబెట్టుకున్నాను. నేను ముఖ్యమంత్రిగా 14 డీఎస్సీలు నిర్వహించాను. గతంలో టీచర్లు బదిలీల కోసం రాజకీయ నేతల చుట్టూ తిరగాల్సి వచ్చేది. దీన్ని తొలగించి కౌన్సెలింగ్ విధానాన్ని తెచ్చాను. 'మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్'కు వచ్చిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును సీఎం చంద్రబాబుకు అందజేస్తున్న గిన్నిస్‌బుక్ ప్రతినిధి.చిత్రంలో మంత్రి లోకేశ్, పాఠశాల విద్యా కార్యదర్శి కోన శశిధర్ దేశంలోనే ఉత్తమ విద్యార్థులుగా మన పిల్లలను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి చంద్రబాబు

తరువాయి 2లో..

# భారత్‌కు దూరమయ్యాం

## ట్రంప్ కీలక వ్యాఖ్యలు



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

భారత్– అమెరికా సంబంధాలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు దిగజారాయనే అర్థంలో మాట్లాడిన ఆయన.. తాము భారత్, రష్యాలకు దూరమైనట్లే అని వ్యాఖ్యానించారు. షాంఘై సహకార సంస్థ సదస్సులో మోదీ, పుతిన్, జిన్‌పింగ్‌లు కలిసి ఉన్న ఫొటోను షేర్ చేసిన ట్రంప్.. ఆ మూడు దేశాలకు ఉజ్వల భవిష్యత్తు కలిగి ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. "భారత్, రష్యాలను చైనాకు కోల్పోయినట్లు కనిపిస్తోంది. ఆ మూడు దేశాలకు ఉజ్వల, సుసంపన్నమైన భవిష్యత్తు ఉండాలని కోరుకుంటున్నా" అని ట్రంప్ తన సోషల్

తరువాయి 2లో..

# కృష్ణా నదిపై ఐకానిక్ వంతెన..

## డిజైన్‌ను ఎంపిక చేసే అవకాశం ప్రజలకే!

### కృష్ణా నదిపై ఐకానిక్ వంతెన నిర్మాణానికి ప్రభుత్వ సన్నాహాలు

### రాజధాని అమరావతి నుంచి జాతీయ రహదారికి అనుసంధానం



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

రాజధాని అమరావతికి మణిహారంగా నిలి చేలా కృష్ణా నదిపై ఒక అద్భుతమైన 'ఐకా నిక్' వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ ప్రతిష్ఠాత్మక వంతెన తుది రూపును ఎంపిక చేసే బాధ్యతను ప్రజలకే అప్పగించడం విశేషం. ఇందుకోసం నాలుగు ప్రత్యేకమైన డిజైన్లను ఎంపిక చేసి, ప్రజాభిప్రాయ సేకరణ

తరువాయి 2లో..

# నేను అక్కడి వరకు వెళ్లానంటే కారణం నా టీచర్లే

### విజయవాడలో ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు

### 175 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

### ప్రభుత్వ విద్యలో 'ఆంధ్ర మోడల్' తీసుకొచ్చి దేశానికే ఆదర్శంగా నిలుస్తామన్న లోకేశ్




**అమరావతి, సిటిజన్ టైమ్స్**

తాను విద్యార్థిగా ఉన్నప్పుడు ఓ బ్యాక్ బెంచర్‌నని, అలాంటి తాను ప్రపంచ ప్రఖ్యాత స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం వరకు ప్రయాణించగలిగానంటే, దానికి ఏకైక కారణం తన ఉపాధ్యాయులు చూపిన మార్గమేనని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. గురువు లేనిదే ఏ మనిషి ఉన్నత స్థానానికి చేరుకోలేడని, తన జీవితంలో తల్లి తర్వాత తాను అత్యంత గౌరవించేది ఉపాధ్యాయులనేనని ఆయన ఉద్ఘాటించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా విజయవాడలోని ఏ-కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం నాడు రాష్ట్ర ప్రభుత్వం గురుపూజోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి హాజరైన లోకేశ్, రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన 175 మంది ఉత్తమ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులకు పురస్కారాలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, తన పాఠశాల రోజులను గుర్తుచేసుకున్నారు. "మిమ్మల్ని చూశాక నాకు నా స్కూల్ రోజులు గుర్తొచ్చాయి. నేను బాగా అల్లరి చేసేవాడిని, మాది రౌడీ బ్యాచ్. అలాంటి నన్ను మంజులా మేడమ్, ప్రిన్సిపల్ రమాదేవి గారు, ఆ తర్వాత పి. నారాయణ గారు, ప్రొఫెసర్

తరువాయి 2లో..

# రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూనే ఉంటాం

### నిర్మలా సీతారామన్



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

అమెరికా అదనపు సుంకాలు విధించినప్పటికీ.. భారత్ తలొగ్గలేదు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ఈ అంశంపై స్పందించారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. భారత తన సొంత ప్రయోజనాలకనుగుణంగా ఇంధన ఎంపికలు చేసుకుంటుందని వెల్లడించారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. "రష్యా చమురు కొనుగోలు

తరువాయి 2లో..

## విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్..

# ఏమిటీ 'పాన్-పాన్' సిగ్నల్?




**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఢిల్లీ నుంచి ఇందౌర్ బయలుదేరిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో ఎమర్జెన్సీ ప్రకటించిన పైలట్.. 'పాన్-పాన్' కాల్‌తో స్థానిక ఏటీసీని అప్రమత్తం చేశారు. చివరకు విమానం సురక్షితంగా ల్యాండింగ్ కావడంతో సిబ్బంది, ప్రయాణికులు ఊపిరి పీల్చుకు న్నారు. ఆ సమయంలో విమానంలో 161 మంది ప్రయా ణికులు ఉన్నట్లు తెలిసింది. ఢిల్లీ నుంచి ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ 1028 విమానం.. 161 ప్రయాణికులతో ఇందౌర్ బయ లుదేరింది. గాల్లో ఉండగానే ఓ ఇంజిన్ ఆయిల్ ఫిల్టర్‌లో సమస్య ఉన్నట్లు పైలట్ గుర్తించారు. వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు పాన్-పాన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రామా ణిక నిర్వహణ విధానానికి అనుగుణంగా గ్రౌండ్ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. 20 నిమిషాల ఆలస్య మైనప్పటికీ.. చివరకు విమానం సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. సమస్య గురించి తెలియగానే అత్యవసర బృందాలను

తరువాయి 2లో..

# 13న బంగాళాఖాతంలో అల్పపీడనం.. ఈ నెలాఖరు వరకు విస్తారంగా వర్షాలు

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్**

బంగాళాఖాతంలో ఈ నెల 13న అల్పపీడనం ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా ఏపీ, ఒడిశా, తెలంగాణ వైపు కదిలే అవకాశముందని, దీని ప్రభావంతో ఈ నెలాఖరు వరకు తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురవొచ్చని పేర్కొంది. మరోవైపు రాబోయే 4 రోజుల్లో రాష్ట్రంలోని పలు

తరువాయి 2లో..





# ధరణి దోపిడీ కోసమే

### అది నాటి పాలకులు అంటించిన వైరస్

### ఆ దుస్థితిని భూభారతి చట్టంతో దూరం చేశాం

### గత ప్రభుత్వంలో అక్రమాలు బయటకు రాకుండా ఉండేందుకే నాడు వీఆర్వో వ్యవస్థను రద్దు చేశారు

### భూమిని చెరపట్టినోళ్లను తరిమికొట్టిన తెలంగాణ

### గ్రామ పాలన అధికారుల నియామక పత్రాల పంపిణీలో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, సిటిజన్ టైమ్స్**

రాష్ట్రంలో రైతులకు, ప్రజలకు ధరణితో పట్టిన దుస్థితిని భూభారతి చట్టంతో దూరం చేశామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భూమిని చెరపట్టినోళ్లను దిగంతాలకు తరిమికొట్టిన చరిత్ర తెలంగాణకు ఉందని, ధరణి అనేది ఆనాటి పాలకులు అంటించిన వైరస్ అని వ్యాఖ్యానించారు. ధరణి ముసుగులో దోపిడీకి పాల్పడిన వారికి ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పారని అన్నారు. 'గత పాలనలో వీఆర్‌వోలను, వీఆర్‌ఏలను సమాజం ముందు దోషులుగా నిలబెట్టి రోజుల కొద్దీ విషప్రచారం చేశారు. ఈ విషయం ప్రజల మెదళ్లలో బలంగా నాటుకుంది. ఆ మచ్చ తొలగించుకునే అవకాశం నియామక పత్రాలు

తరువాయి 2లో..

## ఎడిటోరియల్

# అధ్యక్షా అంటున్న తమ్ముళ్ళు !

విశాఖ వంటి ప్రతిష్టాత్మకమైన జిల్లాకు అధికారంలో టీడీపీ వంటి పార్టీకి ప్రెసిడెంట్ అంటే ఆ హోదావే వేరు. ఆ లెక్కే కిక్కు ఇచ్చేలా ఉంటుంది. ఒక విధంగా మంత్రి పదవితో సమానంగానే ఉంటుంది. పైగా విశాఖ జిల్లాకు తరచూ ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రి లోకేష్ సహా కీలక నేతలు వస్తూంటారు. అంతే కాదు టీడీపీకి కంచుకోట లాంటి సిటీ విశాఖ. అందుకే విశాఖ జిల్లా తెలుగుదేశం అధ్యక్ష పదవి కోసం పోటీ చాలా ఎక్కువగా ఉంది. ఇక విశాఖ జిల్లా టీడీపీ అధ్యక్ష పీఠం అనగానే రేసులో ఎక్కువ మందే కనిపిస్తున్నారు. విశాఖ పార్లమెంట్ పరిధిలోకి వచ్చే ఆరు నియోజకవర్గాల నుంచి పోటీ యమ జోరుగా ఉంది. భీమునిపట్నం నుంచి దాదాపుగా అర డజన్ మంది దాకా పోటీ పడుతున్నారు. అందులో ఒక మహిళా కార్పోరేటర్ కూడా ఉన్నారు. ఆమెకు ఎమ్మెల్సీ ఇస్తామని చెప్పారని ఇపుడు టీడీపీ అధ్యక్ష పీఠం అయినా ఇస్తే బాగుంటుందని విద్యాధికురాలిగా న్యాయం చేస్తారు అని అంటున్నారు. అంతే కాదు విశాఖ జిల్లాకు తొలి మహిళా అధ్యక్షురాలిగా ఆమె రికార్డు సృష్టించాలని చూస్తున్నారు. మరో వైపు చూస్తే భీమిలీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు వర్గం నుంచి కూడా పోటీ ఉంది. ఆయన ఆశీస్సులతో పీఠం ఎక్కాలని చూస్తున్నారు. ఇక కాపు సామాజిక వర్గానికి చెందిన వారు ఈ పదవి మీద కన్నేశారు అని అంటున్నారు విశాఖ జిల్లాకు ఎటూ మంత్రి పదవి ఇవ్వలేదని కాపుల ప్రాబల్యం అధికంగా ఉన్న ఈ జిల్లాలో కీలక పదవిని వారికి ఇస్తే బాగుంటుంది అన్న చర్చ కూడా పార్టీలో సాగుతోంది అని అంటున్నారు. మరో వైపు టీడీపీ స్థాపించాక రెడ్లు, కాపులు ఇతర సామాజిక వర్గాల నుంచి విశాఖ జిల్లా అధ్యక్ష పదవిని చేసిన వారు ఉన్నారు అని గుర్తు చేస్తున్నారు. కానీ కమ్మ సామాజిక వర్గానికి ఈ పదవి ఎపుడూ దక్కలేదని గుర్తు చేస్తున్నారు. విశాఖ నగరంలో ప్రభావంతమైన పాత్ర పోషిస్తూ టీడీపీ ఎదుగుదలలో తమ వంతు కృషిని చేసిన కమ్మలకు ఈసారి అవకాశం ఇవ్వాలని అంటున్నారు. విశాఖ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామక్రిష్ణబాబు సన్నిహిత బంధువు, కేలక నేతకు ఈ పదవిని ఇస్తే ఆయన బాగా నిర్వహిస్తారు అన్న చర్చ కూడా సాగుతోందిట. ఇక చూస్తే విశాఖ నుంచి ఏపీ టీడీపీ ప్రెసిడెంట్ గా పల్లా శ్రీనివాసరావు యాదవ సామాజిక వర్గానికి చెందిన వారు, అలాగే చూస్తే కనుక విశాఖ మేయర్ పదవిని గవర సామాజిక వర్గానికి ఇచ్చారు. నిన్నటిదాకా వెలమ సామాజిక వర్గానికి చెందిన వారు ఈ పదవిని నిర్వహించారు. దాంతో పాటు విజయనగరం జిల్లా అధ్యక్ష పదవిని కాపులకు ఇస్తే శ్రీకాకుళం జిల్లా పదవిని కాళింగులకు ఇస్తే విశాఖ జిల్లా అధ్యక్ష పదవిని కమ్మలకు ఇస్తే సామాజిక సమీకరణలు సరిపోతాయని అనుకుంటే కీలక నేతలు ఈ పదవి దక్కే చాన్స్ ఉంది. అదే విధంగా మైనారిటీలు కూడా ఈ పదవి కోసం చూస్తున్నాయి కాబట్టి వారికి ఏమైనా అవకాశం ఇవ్వాలని అనుకుంటే మాత్రం నిర్ణయం మారుతుందని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# ప్రజా దర్బారులో 80 అర్జీలు

**చీరాల, సిటిజన్ టైమ్స్ , సెప్టెంబరు 5 :**

చీరాల క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఆదేశాల మేరకు శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా దర్బార్ లో పెన్షన్ కోసం 15, ఇళ్ల స్థలాల కోసం 60, ఇతర సమస్యల పరిష్కారం కోసం 5 అర్జీలు సహా మొత్తం 80 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో చీరాల మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం, కారంపూడి పద్మిని, ప్రసన్న, మరియు తదితరులు పాల్గొన్నారు.



# ధరణి దోపిడీ కోసమే

పొందుతున్న 5 వేల మంది గ్రామ పాలన అధికారుల చేతుల్లో ఉంది. గ్రామాల్లో ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించండి. ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా పనిచేయండి. తొమ్మిది లక్షల సాదాబైనామాలు ఏళ్లుగా నిరీక్షిస్తున్నాయి. వీటికి పరిష్కారం చూపించాలి' అని సీఎం ఉద్బోధించారు. శుక్రవారం హైటెక్స్‌లో జరిగిన ప్రజాపాలనలో కొలువుల పండగ కార్యక్రమంలో 5,106 మందికి గ్రామ పాలన అధికారులుగా(జీపీవోలుగా) ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. 'గత ప్రభుత్వ హయాంలో నాటి పాలకులు కొల్లగొట్టిన భూముల వివరాలు బయటకు తీయండి. నాడు జరిగిన దోపిడీ, తప్పుడు విధానాలు, అక్రమాలు ప్రజలకు వివరించండి' అని జీపీవోలకు సూచించారు.

**ధరణి భూతంలా పట్టిపీడించింది..**

"గత పాలకుడు.. తన భూదాహంతో భూమిని చెరబట్టేందుకు ధరణి భూతాన్ని సృష్టించారు. ధరణి ద్వారా కొల్లగొట్టే భూముల వివరాలు ప్రజలకు తెలియకుండా ఉండేందుకు వీఆర్ఏ, వీఆర్వో వ్యవస్థల్ని తొలగించారు. వారిని నిస్సహాయుల్ని చేసి ఉద్యోగాల నుంచి విసిరేశారు. ఎన్నికల ముందు పాదయాత్రలో ఎవరిని కదిలించినా ధరణి.. భూతంగా మారి పీడిస్తోందని.. ఈ కొరివి దయ్యం నుంచి విముక్తి కల్పించాలని కోరారు. అందుకే భూభారతి–2025 చట్టాన్ని తెచ్చి తెలంగాణలోని నాలుగు కోట్ల మంది ప్రజలకు అంకితం చేశాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న రెవెన్యూ సంఘాల ప్రతినిధులు లచ్చిరెడ్డి, బాణాల రాంరెడ్డి, రామకృష్ణ, రాములు, రాధ, జయశ్రీ తదితరులు

**నాడు ఎన్నెన్నో ఘటనలు...**

ధరణితో రికార్డుల్లో యజమాని పేరు రాదు.. అమ్ముకున్నోడి పేరు వస్తుంది. తహసీల్దార్ల వద్ద అధికారం లేదు. కలెక్టర్లకు బాధ్యతలు ఇచ్చి, నాడు కుర్చీల్లో కూర్చున్న పెద్దలు అధికారం తమ చేతుల్లో పెట్టుకున్నారు. ప్రజల్లో కోపం ఆవేశంగా మారడంతో అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్‌ను సజీవదహనం చేశారు. సిరిసిల్లలో ఓ ఆడబిడ్డ ధరణితో సమస్య వచ్చిందని, సవరించాలని తన తాళిబొట్టును తహసీల్దారు కార్యాలయానికి పెట్టారు. వాస్తవానికి ఇది అధికారుల సమస్య కాదు. ఆనాటి పాలకులు తీసుకువచ్చిన, అంటించిన వైరస్" అని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు.

**ప్రజలకు చుట్టం.. భూభారతి: పొంగులేటి**

ధరణి భూతాన్ని బంగాళాఖాతంలో పడేసి... ప్రజలకు చుట్టంగా ఉండే భూభారతి–2025 చట్టాన్ని తీసుకువచ్చామని మంత్రి పొంగులేటి తెలిపారు. "హద్దు వివాదాలు పరిష్కరిచేందుకు ప్రస్తుతమున్న 318 మంది సర్వేయర్లకు అదనంగా మరో 800 మందిని నియమించనున్నాం. ఇక నుంచి గ్రామ రెవెన్యూ అధికారులు ప్రతి ఏడాది డిసెంబరు 31న జమాబందీ నిర్వహిస్తారు" అని తెలిపారు. నిబద్ధతతో పని చేస్తామని గ్రామ పాలన అధికారులతో మంత్రి ప్రతిజ్ఞ చేయించారు. పది వేల మంది వరకు లైసెన్స్ సర్వేయర్లు నవంబరు నాటికి అందుబాటులోకి వస్తారని రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి లోకేష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి సీతక్క, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డిరంగారెడ్డి, గాంధీ, మండలి విప్ మహేందర్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్లానింగ్ కమిషన్ వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డి పాల్గొన్నారు. సీఎంకు రెవెన్యూ సంఘాల ప్రతినిధులు, అధికారులు జ్ఞాపిక అందజేశారు. ఏ వ్యవస్థలో అయినా 2–5 శాతం మంది చెడ్డవాళ్లు ఉంటారు. అందరినీ ఒకే మాదిరి చూడకూడదు. ఎలుకను పట్టుకోవాలంటే ఇల్లు తగలబెడతామా? తప్పుదారిలో ఉన్నవారికి సరిదిద్దుకునే అవకాశమివ్వాలి. ఆ తరువాత చట్టాలు, విధివిధానాలకు లోబడి చర్యలు తీసుకోవచ్చు. గత పాలకులు వీఆర్వో, వీఆర్ఏలను దొంగలుగా, రాష్ట్రాన్ని దోచుకున్నారన్నట్టుగా మచ్చ వేశారని.. అది చెరిపినా చెరగని స్థాయిలో ఉందని, ఈ వ్యవస్థను పునరుద్ధరిస్తే చెడ్డపేరు వస్తుందని కొందరు చెప్పారు. 'నాటి పాలకులు కట్టిన కాళేశ్వరం కూలిపోయింది. దాన్ని రద్దుచేస్తారా.. వీఆర్వోలను తొలగించినట్లు తొలగిస్తారా' అని అడిగా. రైతుల సమస్యలు పరిష్కరించే బాధ్యత తీసుకుంటారని గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించాం. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురారన్న పూర్తివిశ్వాసం ఉంది.

# నేను అక్కడి వరకు వెళ్లానంటే కారణం నా టీచర్లే

రాజిరెడ్డి గారు తీర్చిదిద్దారు. ఈ నలుగురు గురువుల వల్లే నేను ఈ రోజు విద్యాశాఖ మంత్రిగా మీ ముందు నిలబడగలిగాను" అని భావోద్వేగంగా ప్రసంగించారు.

**ప్రభుత్వ విద్య అంటే ఏపీ గురించే మాట్లాడాలి**

ప్రభుత్వ విద్యారంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే ఆదర్శంగా నిలబెట్టాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ స్పష్టం చేశారు. "ప్రభుత్వ విద్య గురించి ఎవరైనా మాట్లాడితే, అది ఆంధ్రప్రదేశ్ గురించే అయి ఉండాలి. ఢిల్లీలో ఏదో మేజిక్ జరుగుతోందని అంటున్నారు. దానికి ఫుల్‌స్టాప్ పెట్టి, అసలైన అద్భుతం ఏపీలో ఉందని చేసి చూపిద్దాం. అందరం కలిసికట్టుగా 'ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్' (లీప్)ను విజయవంతం చేద్దాం" అని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్న తన పిలుపునకు ఉపాధ్యాయులు అద్భుతంగా స్పందించారని, కొందరు స్కూటర్‌కు మైక్ కట్టుకుని మరీ ప్రచారం చేశారని ప్రశంసించారు. ప్రభుత్వ బడుల్లో చేరిస్తే 'జీరో ఇన్వెస్ట్‌మెంట్, హై రిటర్న్స్' వస్తాయని ఓ మహిళా టీచర్ చెప్పిన మాటలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా కొన్ని ప్రభుత్వ పాఠశాలల ముందు 'నో అడ్మిషన్' బోర్డులు పెట్టారంటే, ఆ ఘనత పూర్తిగా ఉపాధ్యాయులదేనని కొనియాడారు.

**డీఎస్సీ అంటే చంద్రబాబు.. చంద్రబాబు అంటే డీఎస్సీ**

ఉపాధ్యాయ నియామకాల విషయంలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని లోకేష్ తెలిపారు. "డీఎస్సీ అంటే చంద్రబాబు గారు.. చంద్రబాబు గారంటే డీఎస్సీ. ఆయన హయాంలోనే అత్యధిక నియామకాలు జరిగాయి. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక తొలి సంతకం మెగా డీఎస్సీపైనే పెట్టారు. డీఎస్సీ ప్రక్రియను ఆపాలని దాదాపు 70 కేసులు వేశారు. అయినా, ఎక్కడా ఆగకుండా ఈ సెప్టెంబర్‌లో 16,347 మంది ఉపాధ్యాయులు తరగతి గదుల్లో అడుగుపెట్టబోతున్నారు" అని ప్రకటించారు. గత ఐదేళ్ల పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యమైందని, ఉపాధ్యాయులను తీవ్రంగా అవమానించారని లోకేష్ విమర్శించారు. "2019 నుంచి 2024 వరకు ఒక విచిత్రమైన పాలన చూశాం. రోజుకో సంస్కరణ పేరుతో గందరగోళం సృష్టించి, 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడులకు దూరం కావడానికి కారణమయ్యారు. ఉపాధ్యాయులతో వైన్ షాపుల ముందు కాపలా కాయించిన దుస్థితిని చూశాం. జీతాలు ఎప్పుడొస్తాయో తెలియని పరిస్థితి ఉండేది. అలాంటి కష్టాలన్నింటినీ ఎదుర్కొని నిలబడిన మీ అందరికీ నా ధన్యవాదాలు" అని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని చిన్ని, పలువురు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కృష్ణా నదిపై ఐకానిక్ వంతెన..

కోసం సీఆర్‌డీఏ (రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ) వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. రాజధాని అమరావతిలోని రాయపూడి నుంచి నదికి అవతలి వైపున ఉన్న ఎన్టీఆర్ జిల్లాలోని మూలపాడు వరకు ఈ వంతెనను నిర్మించనున్నారు. సుమారు 5 కిలోమీటర్ల పొడవుతో ఉండే ఈ కేబుల్ వంతెన, అమరావతిని విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారితో నేరుగా కలుపుతుంది. దీనివల్ల రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగుపడనున్నాయి.

**తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా డిజైన్లు**

ప్రజల ఓటింగ్ కోసం ఉంచిన నాలుగు నమూనాలు ఆధునిక ఇంజినీరింగ్‌తో పాటు తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా ఉన్నాయి. వీటిలో మూడు డిజైన్లు తెలుగువారి గర్వకారణమైన కూచిపూడి నృత్యంలోని విభిన్న భంగిమల స్ఫూర్తితో రూపొందాయి. మరొక డిజైన్, రాజధాని అమరావతికి సూచికగా ఆంగ్ల అక్షరం 'ఏ' ఆకారంలో ఆకట్టుకుంటోంది. ఈ నమూనాలు రాజధానికి సాంస్కృతిక గుర్తింపును తీసుకురావడంతో పాటు పర్యాటక ఆకర్షణగా నిలుస్తాయని అధికారులు భావిస్తున్నారు.

**ఓటింగ్ ఇలా..**

ప్రజలు తమకు నచ్చిన డిజైన్‌కు ఓటు వేయడానికి సీఆర్‌డీఏ వెబ్‌సైట్‌ను సందర్శించాలి. అక్కడ తమ పేరు, ఫోన్ నంబర్‌ను నమోదు చేసి, నాలుగు డిజైన్లలో ఒకదానిని ఎంచుకోవాలి. ఆ తర్వాత క్యాప్చా కోడ్‌ను ఎంటర్ చేసి ఓటును ఖరారు చేయవచ్చు. అత్యధిక ఓట్లు పొందిన డిజైన్‌ను ప్రభుత్వం వంతెన నిర్మాణానికి ఫైనల్ చేస్తుంది.

# పిల్లల బాధ్యత మీది.. మీ బాధ్యత నాది

పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులకు ఇబ్బంది రాకుండా చూసే బాధ్యత తనదని.. విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దే బాధ్యత టీచర్లు తీసుకోవాలని కోరారు. పిల్లలకు కేవలం పాఠాలు చెప్పడమే కాకుండా వారిలో స్ఫూర్తి నింపి, నైపుణ్యాలను వెలికితీయాలని, నైతిక విలువలు నేర్పాలని సూచించారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని విజయవాడలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. 175 మంది ఉపాధ్యాయ, అధ్యాపక, ఆచార్యులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నీలో ప్రతిభ ఉంది.. ఆర్థికశాస్త్రం అధ్యాపకుడిగా పనిచేస్తావా? సిఫార్సు చేస్తానని మా టీచర్ అన్నారు. నేను చేరను.. ఎమ్మెల్యేగా పోటీ చేస్తానన్నా. గెలుస్తావా అని ఆయన అడిగారు. కచ్చితంగా గెలుస్తాను, గెలిచి వచ్చిన తర్వాత కలుస్తాను అని చెప్పాను. ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రినయ్యాను' అని పేర్కొన్నారు. 'గురుపూజోత్సవాన్ని పవిత్రమైన కార్యక్రమంగా భావిస్తాను. అందుకే సీఎం అయినప్పటి నుంచి ప్రతి ఏడాది దీనికి హాజరవుతున్నా. జీవితంలో ఎవరినైనా మర్చిపోతాం గానీ ఉపాధ్యాయులను మర్చిపోలేం. నాకు చిన్నతనంలో చదువు చెప్పిన భక్తవత్సలం మాస్టారు ఇంకా గుర్తున్నారు. నేను నిత్య విద్యార్థిని. నేర్చుకున్న అంశాలను ప్రజలకు ఎలా ఉపయోగించాలో ఆలోచిస్తుంటాను.

**ఆస్తులు కాదు.. విద్యను అందించాలి**

పిల్లలకు ఆస్తులు కాదు.. విద్యను అందించాలి. మార్కెట్‌లో వస్తున్న మార్పులకు అనుగుణంగా పిల్లలకు బోధన అందించాలి. టీచర్లు టెక్నాలజీపై పట్టు సాధించాలి. నేను సీఎం అయిన కొత్తలో ఐఐటీల్లో తెలుగువారే కనిపించేవారు కాదు. ఆ రోజుల్లో చుక్కా రామయ్య ఐఐటీ ప్రవేశపరీక్షకు శిక్షణ ఇవ్వడానికి పరీక్ష పెడితే 10 వేల మంది హాజరయ్యేవారు. ఆయన 100 మందికే సీట్లు ఇచ్చేవారు. సీఎంగా నేను సిఫార్సు చేసినా ఇచ్చేవారు కాదు. ఇప్పుడు ఐఐటీల్లో తెలుగువారే ఎక్కువ సీట్లు సాధిస్తున్నారు. లోకేశ్ చదువు నా భార్య చలవే: సాధారణంగా రాజకీయ నాయకుల కుమారులు పెద్దగా చదువుకోరు. లోకేశ్ మాత్రం స్టాన్‌ఫర్డ్‌లో చదువుకున్నారు. ప్రపంచ బ్యాంకు వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ఉద్యోగాలు చేశారు. లోకేశ్ చదువు విషయంలో క్రెడిట్ అంతా నా భార్యదే. నా మనవడు దేవాన్ష్ చాలా ఫాస్ట్‌గా ఉంటాడు. వాడు చెప్పేది నాకే అర్థం కాదు. నేను థియరిటికల్‌గా ఉంటే లోకేశ్‌ది ప్రాక్టికల్ మనస్తత్వం' అని చంద్రబాబు పేర్కొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

# రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూనే ఉంటాం

కొనసాగుతుంది. మన అవసరాలకు తగినది కొనడం.. చమురును ఎక్కడి నుంచి కొనుగోలు చేయాలనే దానిపై నిర్ణయం మనమే తీసుకోవాలి" అని భారత వైఖరిని సీతారామన్ స్పష్టం చేశారు. ఇక అమెరికా అదనపు సుంకాల నేపథ్యంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఎగుమతిదారుల అంశంపై కూడా ఆర్థిక మంత్రి స్పందించారు. ఎగుమతిదారుల కోసం ఉపశమన చర్యల ప్యాకేజీని త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు. ఇటీవల విధించిన సుంకాలతో ప్రభావితమైన పరిశ్రమలను ఈ ప్యాకేజీ ఆదుకుంటుందని తెలిపారు. రష్యా చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై ట్రంప్ అదనంగా 25 శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. దీంతో భారత ఉత్పత్తులపై సుంకాలు 50 శాతానికి పెరిగాయి.

# భారత్‌కు దూరమయ్యాం ట్రంప్ కీలక వ్యాఖ్యల

మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో వ్యంగ్యంగా పోస్టు పెట్టారు. ప్రతీకార సుంకాలతో ప్రపంచ దేశాలపై ట్రంప్ విరుచుకుపడుతున్న వేళ.. తియాన్‌జిన్ వేదికగా జరిగిన ఎస్‌సీవో సదస్సులో రష్యా, చైనా, భారత్ అధినేతలు ఒకే వేదికపై కనిపించారు. అంతర్జాతీయంగా ఎదురవుతున్న సవాళ్లపై చర్చించిన వీరు.. తామంతా ఏకతాటిపై ఉన్నట్లు సంకేతాలిచ్చారు. వీరి సమావేశంపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరిగింది. ట్రంప్ తీరువల్లే ఆ మూడు దేశాలు ఒక్కటయ్యాయనే వాదన కూడా అమెరికాలో వినిపించింది. ఈ నేపథ్యంలో మిత్ర దేశంగా ఉన్న భారత్ దూరమైనట్లు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# ప్రధాని మోదీతో ఏపీ మంత్రి నారా లోకేశ్ భేటీ

కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల స్థాపనకు చేయూత అందించాలని విజ్ఞప్తి చేశారు. విద్యాప్రమాణాల మెరుగుదలకు రాష్ట్ర విద్యారంగంలో అనేక సంస్కరణలు అమలు చేస్తున్నామని.. ఉన్నతవిద్యలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు సహకారం అందించాలని కోరారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 15నెలలుగా కేంద్రం సహకారంతో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేస్తున్నామని చెప్పారు. జీఎస్టీ సంస్కరణల ద్వారా దేశంలోని కోట్లాది పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కలిగించిన ప్రధాని మోదీకి మంత్రి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో గత కొంతకాలంగా నెలకొన్న వివిధ పరిణామాలను ఆయన వివరించారు. ప్రధాని స్పందిస్తూ.. రాష్ట్రాభివృద్ధికి అన్నివిధాలా సహకారం అందిస్తామని చెప్పారు. యోగాంధ్ర నిర్వహణపై రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ను ఈ సందర్భంగా ప్రధానికి లోకేశ్ బహుకరించారు. నేడు పలువురు కేంద్ర మంత్రులతో లోకేశ్ సమావేశం కానున్నారు. మే 17న తన సతీమణి నారా బ్రాహ్మణి, కుమారుడు దేవాంశ్‌లతో మోదీని కలిసిన లోకేశ్.. నాలుగు నెలల వ్యవధిలో మళ్లీ ప్రధానమంత్రిని కలవడం విశేషం.

# విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్.. ఏమిటీ 'పాన్-పాన్' సిగ్నల్?

సిద్ధంగా ఉంచామని ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ వెల్లడించింది. ఇటువంటి సవాళ్లను ఎదుర్కోవడంలో తమ పైలట్లు ఉత్తమ శిక్షణ కలిగి ఉన్నారని తెలిపింది.

**ఏమిటీ 'పాన్–పాన్' సిగ్నల్..?**

పాన్–పాన్ సిగ్నల్ అనేది సముద్రయానం, వైమానిక కమ్యూనికేషన్ వ్యవస్థలో భాగం. ఇదో ఎమర్జెన్సీ సందేశం. విమానయానంలో ఇది అత్యవసర పరిస్థితిని సూచించినప్పటికీ.. మేడే సిగ్నల్ అంత తీవ్ర పరిస్థితి కాదు. ప్రయాణికులకు, సిబ్బందికి ప్రాణాపాయ స్థితి లేకున్నా.. సాయం కావాలని విజ్ఞప్తి చేసే ఓ సందేశం. పైలట్ 'పాన్–పాన్' సిగ్నల్ ఇచ్చారంటే.. ఏటీసీ లేదా గ్రౌండ్ సర్వీసు నుంచి తక్షణ సాయం అవసరమని అర్థం. పైలట్ నుంచి అందుకున్న వెంటనే అంబులెన్సులు, అగ్నిమాపక బృందాలతో క్షేత్రస్థాయి సిబ్బంది రన్‌వే సమీపంలో మోహరిస్తారు. అత్యవసర పరిస్థితికి అనుగుణంగా స్పందిస్తారు.

# 13న బంగాళాఖాతంలో అల్పపీడనం.. ఈ నెలాఖరు వరకు విస్తారంగా వర్షాలు

ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు పడొచ్చని అమరావతి వాతావరణ విభాగం తెలిపింది. శుక్రవారం అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వేడి, ఉక్కపోత పెరిగింది. కాకినాడ, నరసాపురం, మచిలీపట్నం, గన్నవరం, బాపట్ల, కావలి, నెల్లూరు తదితర ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. రాబోయే బుధ, గురువారాల్లో ఉత్తర కోస్తా, రాయలసీమలోని కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు ఉంటాయని చెప్పింది. మరోవైపు మధ్యప్రదేశ్, రాజస్థాన్ పరిసరాల్లో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది పశ్చిమ–వాయవ్య దిశగా రాజస్థాన్, గుజరాత్ వైపు కదులుతూ ఆదివారం నాటికి వాయుగుండంగా బలపడే అవకాశముందని భారత వాతావరణ విభాగం పేర్కొంది.

# ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

## పిల్లలతో స్నేహపూర్వకంగా మెలగాలి.

## విద్యార్థులను సక్రమ మార్గంలో నడిపే గురుతర బాధ్యత ఉపాధ్యాయులదే.

## జిల్లా ఇంచార్జి మంత్రి. డా.డోలా బాల వీరాంజనేయ స్వామి.

**ఎంవీపీ కాలనీ, సిటిజన్ టైమ్స్ , సెప్టెంబరు 5 :**

విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలిగి వారిని సక్రమ మార్గంలో నడిపించవలసిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, దివ్యాంగుల, వయో వృద్ధుల గ్రామ వార్డు సచివాలయాల శాఖామంత్రి మరియు జిల్లా ఇంచార్జి మంత్రి డా. డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా ఆంధ్రా యూనివర్సిటి అంబేద్కర్ అసెంబ్లీ హాల్ లో విశాఖ జిల్లా గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్ విప్, ఎంఎల్సి వేపాడ చిరంజీవి రావు, పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్, జిల్లా కలక్టర్ ఎం.ఎన్. హరెంధిర ప్రసాద్ తదితరులు సర్వేపల్లి రాదాక్రిష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి , జ్యోతి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన జిల్లా ఇంచార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, మన చారిత్రిక, ఇతిహాసాలలో గురుకులాల వ్యవస్థ ఉందని, గురువుల వ్యవస్థ అతి ప్రాచీనమైనదని మంత్రి పేర్కొన్నారు. మానవనరులు తయారు చేయడంలో ఉపాధ్యాయులది కీలక పాత్ర అన్నారు. కార్పొరేట్ కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలలో నూరు శాతం ఉత్తీర్ణులయ్యే విధంగా బోధన చేయాలని ఉపాధ్యాయులకు






సూచించారు. ఉపాధ్యాయులు పిల్లలకు మార్గదర్శిగా, స్నేహితుడిగా ఉండాలని అన్నారు. చదువుతో పాటు క్రీడలు, ఇతర అంశాలలో కూడా ప్రోత్సహించి ముందుకు తీసుకు వెళ్లాలన్నారు. విద్యారంగం నుండి వచ్చి దేశానికి విశిష్ట సేవ చేసిన వ్యక్తి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ అన్నారు. పూలే, అబ్దుల్ కలాం వంటి తదితరులు విద్యారంగం నుండి ఉన్నత స్థానానికి ఎదిగారని అన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకంలో నాణ్యమైన పోషక విలువలు కలిగిన బియ్యంతో పిల్లలకు భోజనం, నాణ్యమైన విద్యా కిట్లు, యూనిఫారం ప్రభుత్వం అందిస్తున్నాదన్నారు. ఉపాధ్యాయ బదిలీలలో పారదర్శక కోసం కౌన్సిలింగ్ వ్యవస్థ శ్రీ నారా చంద్రబాబు నాయుడు తీసుకొని వచ్చి, రాజకీయ జోక్యం లేకుండా చేశారన్నారు. మానవ వనరుల శాఖామంత్రి నారా లోకేష్ రాష్ట్ర విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకు వస్తున్నారని, డిఎస్ సి ద్వారా పెద్దఎత్తున నియామకం జరిగిందని, ఎక్కువమందికి ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డి.ఇ.ఓ ప్రేమ్ కుమార్, ఎపిసి చంద్ర శేఖర్, డిప్యూటి డిఇఓ సోమేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల పోస్టర్ విడుదల



**అల్లిపురం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05:**

ఈనెల 13వ తారీకు సెలవు విజయవాడ సందర్భంగా ఈరోజు విశాఖ డాబా గార్డెన్స్ లలితా కాలనీ దరి సింగ్ హోటల్ జంక్షన్ వద్ద ఉన్న భవన నిర్మాణ కార్మికులు ఒక పోస్టర్ ని రిలీజ్ చేయడం జరిగింది ఈ సందర్భంగా పవన్ నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కే నర్సింగరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన సెజ్జు మళ్లీ పునర్దించాలని భవన నిర్మాణ కార్మికులకు పని కల్పించే విధంగా సిమెంటు ఇనుము చిప్స్ రేట్లు అందుబాటులో ఉంచాలని అలాగే ఇసుక ఫ్రీగా లభించాలని 10,000 మందితో ఈనెల విజయవాడలో ప్రదర్శన జరగబోతుందని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులందరూ విచ్చేస్తారని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక నాయకులు సిమ్మి నాయుడు, అమరావతి, సరోజినీ, నారాయణమ్మ, పార్వతమ్మ, గురమ్మ, కొర్లమ్మ, సత్తిబాబు, నాయుడు, గౌరు నాయుడు, సత్తిబాబు, ముకుంద, సీఐటీయూ జోన్ కార్యదర్శి చంద్రశేఖర్, 7, దానయ్య పాల్గొన్నారు.

# ఐదవ వార్డ్‌లో ఘనంగా అన్న సమారాధనలు

### ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులకు ప్రసాద వితరణ చేసిన కార్పొరేటర్ మొల్లి హేమలత





**మధురవాడ, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05: :**

వరసిద్ధి వినాయక చవితి నవరాత్రులు సందర్భంగా 5 వ వార్డ్ లో పలు కాలనీ లలో ఘనంగా అన్నాసరాధనలు జరిగాయి. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు మొల్లి హేమలత ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులకు తన స్వహస్తాలతో అన్న ప్రసాదన వితరణ చేశారు. అనంతరం కార్పొరేటర్ హేమలత మాట్లాడుతూ అన్ని దానలకంటే అన్నదానం మిన్న అని అన్నం పరబ్రహ్మ స్వరూపం కావున వినాయక చవితి నవరాత్రులు సందర్భంగా అన్న సమారాధనలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని ఆ విఘ్న వినాయకుని అనుగ్రహం అందరిపై ఉండాలని ఆ దేవ దేవుడైన వినాయకుని కోరుకుంటున్ననీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, ఈగల రవికుమార్,ఓలేటి శ్రావణ్, వంక నూకరాజు, మోకర రవికుమార్, ఈ మంది రాజు, కోలా వెంకటేష్, కోసూరు మాధవ అధిక సంఖ్యలో భక్తులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# కాఫీ పళ్ళను, కాఫీ మొక్కలను తనిఖీ చేస్తున్న ఐటిడిఏ అధికారులు.

**అరకు, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05**

అల్లూరిసీతరామరాజు జిల్లా, అరకువేల్లి మండలం, చిన్నలబుడు పంచాయతీ, తుడుము గ్రామం లో ఐటిడిఏ అధికారులు తనిఖీ చేశారు కాఫీ పళ్ళు పాడేయి పోవడం కాఫీ మొక్కలు కూడా పాడేయి పోవటం గమనించారు. రాబోయే రోజులు కాఫీ రైతులకు కాఫీ పంట ను కాపాడటానికి కావాల్సిన మందులు, సూచనలు ఐటీడిఏ తరపున కాఫీ రైతులకు ఇవ్వనునట్లు తెలుస్తుంది.



# పూర్ణ మార్కెట్ ఆలయానికి రూ.50,000ల ఏ.సి వితరణ

### దుర్గాలమ్మ ప్రజలను చల్లగా చూడాలి అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేసిన వాసుపల్లి



**జగదాంబ, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05:**

దక్షిణ నియోజకవర్గంలో 35వ వార్డు ప్రజల కొంగుబంగారం శ్రీ దుర్గాలమ్మ ఆలయాని కి మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్సిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమారుడు వాసుపల్లి సాకేత్ రూ.50వేల విలువగల ఏసీ వితరణ చేశారు. దక్షిణ నియోజకవర్గ వైసీపీ శ్రేణులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వహకులకు రెండు టన్నుల సామర్థ్యం కలిగిన సాంసంగ్ ఎయిర్ కండిషన్ ను భక్తుల సౌకర్యార్థం కుమారుడు సాకేత్ చేతుల మీదగా బహుకరించారు. వాసుపల్లి గణేష్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరి మీదా ఉండాలని కోరుకుంటూ పూజలు చేశామన్నారు. దక్షిణ నియోజక వర్గం ప్రజల ఆరాధ్య దైవం శ్రీ దుర్గాలమ్మ ను నమ్మిన భక్తులకు వారాలిచ్చే శాంత రూపంలో, దుర్బుద్ధితో చూసేవారికి ఉగ్రరూపంలో దర్శనం ఇస్తారన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలకు సేవ చేసానని వాసుపల్లి అన్నారు. ఆ చల్లని తల్లి ఆశీస్సులు దక్షిణ నియోజకవర్గ ప్రజలను ఉండి కాపాడాలని వాసుపల్లి కోరారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్సీపీ వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గురువుకు శిష్యుల శుభాకాంక్షలు

### కొత్తపాలెం ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**చింతపల్లి (సిటిజన్ టైమ్స్) సెప్టెంబర్ 05**

దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో భాగంగా మండలంలోని కొత్తపాలెం ప్రభుత్వ పాఠశాలలో గురుపూజోత్సవాన్ని ప్రధానోపాధ్యాయురాలు వనబసింగి వరలక్ష్మి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు భగత్ రాం ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ఉపాధ్యాయులు పాఠశాలకు రాగానే విద్యార్థులు ఉపాధ్యాయ ఉపాధ్యాయుని వేషధారణలతో స్వాగతం పలుకుతూ వారికి పూలమాలలు, పుష్పగుచ్ఛాలు ఇచ్చి పాదాలకు నమస్కరించి, శుభాకాంక్షలు తెలియజేస్తూ వారిపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. తమ భవిష్యత్తును తీర్చిదిద్దే గురువులకు ఇలా గౌరవం ఇవ్వడం ఎంతో సంతోషాన్ని, ఉత్సాహాన్ని ఇస్తుందని పలువురు విద్యార్థులు పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం



వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువులను గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, గురువుల గొప్పతనాన్ని చాటిచెప్పే విధంగా విద్యార్థులు ముందుండాలని తెలిపారు. తమను ఆప్యాయంగా పలకరించిన విద్యార్థులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు ఇలా తమను గౌరవించడం చాలా ఆనందంగా ఉందని, వారు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో సెగ్గె చరణ్ సత్య దేవ్, కిల్లో సువర్ణ, ధారలక్ష్మీ, పవిత్ర, నాగలక్ష్మి, జయమాధురి, గోపినాయక మేఘన, దుర్గాభవాని లు ఉపాధ్యాయ, ఉపాధ్యాయినీ వేషధారణలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కూడ సత్తిబాబు, రాంబాబు, మత్స్యరాజు, రజిని, సెగ్గె ఈశ్వరి, ప్రసాద్, పాంగి శ్రీను (కువి మాతృభాష), అధిక సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.





# శ్రీశ్రీశ్రీ వరాహ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం సింహాచలం

### సింహాచలంలో కేంద్ర ప్రభుత్వ కార్యదర్శుల పర్యటన



**గోపాలపట్నం, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05:**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానాన్ని ఇద్దరు కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులు దర్శించుకున్నారు భారత ప్రభుత్వం,న్యాయ మరియు న్యాయ మంత్రిత్వ శాఖ, న్యాయ వ్యవహారాల విభాగం కార్యదర్శి డాక్టర్ అంజు రతి రాణా, మరియు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీమతి దీప్తి గౌర్ ముఖర్జీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వ హించారు ?ఈ ఇద్దరు ప్రముఖులకు ఆలయ సహాయ కార్యనిర్వహణా ధికారి కె.తిరుమలేశ్వరరావు, మరియు పి.ఆర్.ఓ. నాయుడు స్వాగతం పలికారు ముందుగా వారికి ఆలయ ప్రాశస్త్యం గురించి వివరించి, సంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు స్వామివారి దర్శనానికి ముందు అతిథులు ఆలయ ప్రాంగణంలో ఉన్న పవిత్రమైన కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు అనంతరం, స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు దర్శనా నంతరం ఆలయ అధి కారులు డాక్టర్ అంజు రతి రాణా మరియు శ్రీమతి దీప్తి గౌర్ ముఖర్జీలను స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు అనంతరం వారికి స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

# వైకుంఠ వెంకటేశ్వర స్వామి మహాభిషేకం పంచామృత అభిషేకాలు

**గాజువాక, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05:**

జీవీఎంసీ 65 వ వార్డు పరిధి వాంబే కాలనీ గరుడాద్రి కొండపై కొలువుదీరిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ నక్షత్రం(స్వామివారి జన్మ నక్షత్రం) శ్రావణ పౌర్ణమిపురస్కరించుకొని ఉదయం 4 గంటల నుండి మహాభిషేకం పంచామృత అభిషేకలు నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రమణ నేతృత్వంలో స్వామివారి జన్మ నక్షత్రం(శ్రవణ) నాడు స్వామివారికీ ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ఉత్తర ద్వారంలో వెలసిన రెండవ ఆలయముగా గరుడాద్రి కొండపై వెలిసిన వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయం స్వామి వారికి పంచామృత అభిషేకాలతో పాటు వివిధ రకాల పళ్ళ రసాలు కుంకుమ పూజలు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీనివాస ఆచార్యులు, తాతాచార్యులు చే మహాభిషేకం నిర్వహించడం జరిగినది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదములు అన్నప్రసాదం వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ సేవకులు సత్యవతి, హిమాజా,పద్మ,మంగా, చిన్నమ్మ, శోభ, దుర్గ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# గాజువాకలో మహమ్మద్ ప్రవక్త 1500వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి

## ముఖ్యఅతిథిగా రాష్ట్ర టిడిపి అధ్యక్షులు గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు





**గాజువాక,సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05:**
గాజువాకలో ముస్లిం సోదరులందరూ కూడా ఈద్ మీలాదున్నబీ పండుగ చేసుకోవడం జరిగింది ముఖ్యంగా మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు సందర్భంగా ఆయన పుట్టినరోజు వేడుకలు 1500 రోజులు అయిన శుభ సందర్భంలో గాజువాక సున్ని జామా మసీదు నుండి శాంతియాత్ర బయలుదేరి అజిమాబాద్ వీధుల్లో తిరుగుతూ కనితి రోడ్డు మరియు గాజువాక మెయిన్ రోడ్ నుండి బీసీ రోడ్ చేరుకొని బీసీ రోడ్ల గల బాబా సయ్యద్ మదీనా దర్గా వద్ద ఫాతిహా ఆరాధన చేయడం జరిగినది అనంతరం బీసీ రోడ్లో ఈద్గా మైదానంలో జెండా ఎగరవేయడం జరిగింది.ఈ శాంతి యాత్ర సుమారు ఐదు కిలోమీటర్ల మేరకు పాదయాత్ర ద్వారాగా జరిగింది ముఖ్యంగా మహమ్మద్ ప్రవక్త అందరిని శాంతి మార్గంలో నడవమని ఒకరికొకరు సాయం చేసే విధంగా ఉండాలని అందర్నీ ప్రేమ అభిమానంతో చూడాలని పక్క వారు ఆపదలో ఉంటే వారిని ఆదుకోవాలని సమాజ సేవ చేయడంలో అందరూ నిమగ్నమై ఉండాలని ప్రతి ఒక్కరు కూడా కలిసిమెలిసి ఉండాలని సోదర భావంతో ఉండాలని మహమ్మద్ ప్రవక్త పిలుపునిచ్చారు అని మన ముఖ్య అతిథి ఆంధ్ర రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాస్.చెప్పారు పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ గాజువాక లో ఉన్న ముస్లిం సోదరులందరికీ ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న ముస్లిం సోదరులందరికీ కూడా ఈద్ మిలాద్-ఉన్-నబీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు అజిమబాద్ సునీ జామా మసీద్ నిర్మాణానికి వక్స్ బోర్డు ద్వారా నిధులు తీసుకొని వస్తానని అలాగే త్వరలో షాదీ ఖానా నిర్మాణం కూడా చేస్తానని శాసనసభ్యులు చెప్పారు ఈ కార్యక్రమంలో గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ 66 వార్డు మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ, 66వ వార్డు సెక్రెటరీ మొహమ్మద్ ముర్తజా, 66వ వార్డు వైస్ ప్రెసిడెంట్ హాఫిజ్ రహమాన్, మరియు షౌకత్ అలీ, మరియు అజిమాబాద్ సున్ని జామా మసీదు ముత్వల్లి మదీనావళి,మహమ్మద్ ఇషాక్, మోతి,అన్సర్వల్లి, సిరాజ్, మౌలాలి, ఇమామ్ రిజ్వాన్ జావేద్ జాంగిర్, ఆన్సర్ వల్లి, జబ్బర్, అన్వర్,మున్వర్,సాలేహీన్, షబ్బీర్, బుజ్జి, యూత్ కమిటీలు అంజుమన్ సిరతునబి నూర్ పార్టీ అంజుమనే గౌస్ పార్టీ మదీనా పార్టీ రాజా పార్టీ కేజీఎన్ పార్టీ గౌసియా నౌ జవాన్ సొసైటీ మరియు అజీమాబాద్ కమిటీ సభ్యులు మదీనా మసీదు కమిటీ సభ్యులు గౌసియా మసీద్ సభ్యులు వేలాది మంది ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# 41అడుగుల భారీ గణ నాధుని సన్నిధిలో ప్రత్యేక కుంకుమ పూజలు



మధురవాడ, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05:
విశాఖపట్నం మధురవాడ చంద్రంపాలెం గ్రామంలో శ్రీ శివ నందన ప్రియ వినాయకుడు పేరుతో 41 అడుగుల భారీ గణనాధుని సన్నిధిలో శుక్రవారం అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని కుంకుమ పూజలు నిర్వహించారు అనంతరం వినాయక మండపం ఆవరణ లో చంద్రంపాలెం పెద్దలు ఉత్సవ కమిటీ సభ్యులు దాతలు,భక్తులు గ్రామస్తులు అందరీ సహాయ సహకారాల తో భారీ అన్నసంతర్పణ నిర్వహించారు ఈ కార్య క్రమంలో సుమారు 6వేల పైచిలుకు భక్తులు చుట్టూ ప్రక్కల గ్రామస్తులు తది తరులు పాల్గొని స్వామివారి దర్శించుకొని అన్న ప్రసాదం స్వీకరించారు ఈ కార్యక్రమం లో అతిధులు,చంద్రంపాలెం పెద్దలు,ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామస్తులు,యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర గవర్నర్ ను కలిసిన సిపిఎం రాష్ట్ర బృందం.



**అరకు, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05**
రాజ్యంగంలో 5వ షెడ్యూల్ హక్కులైన పీసా, 1/70 , అటవీ హక్కుల చట్టం అమలు మరియు అడవి, సహజ వనరులు పరిరక్షించాలని, పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల సమస్యలు, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఒప్పందాల రద్దు, జి.ఓ 3 చట్టబద్దత, బాషా వలంటీర్ల, నాన్ షెడ్యూల్ గ్రామాలను షెడ్యూల్ ప్రాంతంలో కలపాలని కోరుతూ నేడు రాష్ట్ర గవర్నర్. ఎస్. అబ్దుల్ నజీర్ ను కలిసిన సీపీఎం రాష్ట్ర బృందం.

# లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం.



**ద్వారకాతిరుమల, సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్, 05**
ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ద్వారకాతిరుమల లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ద్వారకాతిరుమల మండలంలో ఉత్తమ ఉపాధ్యాయ సన్మానం ఏర్పాటు చేశారు. లైన్స్ క్లబ్ అధ్యక్షురాలు మొగతడకల లక్ష్మీ రమణి శ్రీనివాస్,ఐడియల్ పబ్లిక్ స్కూల్ జూనియర్ డిగ్రీ కళాశాలలో ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి పూలమాల వేసి. తదుపరి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పి ప్రభాకర్ రావు స్కూల్ అసిస్టెంట్ పంగిడిగూడెం, పి రాజేశ్వరమ్మ స్కూల్ అసిస్టెంట్ తిరుమల పాలెం, బి అపర్ణ జడ్పీహెచ్ఎస్ జి కొత్తపల్లి, ఆర్ .శిరీష ఎస్ జి టి గోపాలపురం ఎం పి పి స్కూల్ అందరికి శాలువా కప్పి సత్కరించి సర్టిఫికెట్లు మరియు మెమొంటోలను శ్రీ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు . సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ మమ్మల్ని గుర్తించి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం చేయడం మాకు ఎంతో సంతోషంగా ఉంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షులు, ఎం సత్యనారాయణ పి వెంకట్రావు లైన్స్ క్లబ్ మెంబర్స్ ,స్కూల్ యాజమాన్యం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఓపెన్ పాలసీల ద్వారా పర్యాటకం రంగంలో మరింత అభివృద్ధి, ఆదాయం

## విశాఖపట్నం ఎంపీ శ్రీ భరత్ వైజాగ్ అంటేనే టూరిజం : అజయ్ జైన్

## ఇక నుంచి ప్రతి నెలా ఒక ఈవెంట్ : జిల్లా కలెక్టర్







**విశాఖపట్నం,సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 05:-**
పర్యాటక రంగంలో ఓపెన్ పాలసీల ద్వారా మరింత అభివృద్ధి జరుగుతుందని, అధిక రెవెన్యూ వస్తుందని విశాఖపట్నం ఎంపీ శ్రీ భరత్ పేర్కొన్నారు. దానికి తగ్గట్లు ప్రభుత్వం, అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాల్సి ఉందని అన్నారు. జిల్లా పర్యాటక శాఖ, వివిధ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఎంజీఎం మైదానంలో ఏర్పాటు చేసిన మూడు రోజుల వైజాగ్ ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, జిల్లా కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్ తో పాటు భాగస్వామ్యమైన ఎంపీ మాట్లాడారు. కార్యక్రమ నిర్వహణకు ముందు అధికారులు కాస్త టెన్షన్ పడ్డారని, వైజాగులో ఏ కార్యక్రమం చేపట్టినా విజయవంతం అవుతుందని వారికి ధైర్యం చెప్పానని గుర్తు చేశారు. అయితే ప్రజల నుంచి ఇంత స్పందన వస్తుందని ఊహించలేదని అన్నారు. ఇది అందరికీ స్ఫూర్తినిచ్చే విజయమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఇలాగే కొనసాగిస్తూ డిమాండ్ కు అనుగుణంగా చర్యలు చేపట్టాలని సూచన చేశారు. మౌలిక వసతులు మరిన్ని కల్పించాలన్నారు. ప్రజలు దీనిపై ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని, పొరపాట్లు ఉంటే సరిదిద్దుకుని భవిష్యత్తులో మరింత బాగా నిర్వహిస్తామని చెప్పారు.

**వైజాగ్ అంటేనే టూరిజం...**

అనంతరం స్పెషల్ సీఎస్ అజయ్ జైన్ మాట్లాడుతూ వైజాగ్ అంటేనే టూరిజం అని, అందుకే ఈ నగరానికి ముఖ్యమంత్రి అంత ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇక్కడి పర్యాటకుల అభిరుచికి అనుగుణంగా కొత్తకొత్త హోటల్స్, రిసార్టు వస్తున్నాయని అన్నారు. భవిష్యత్తులో విశాఖ కేంద్రంగా మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. క్యాలండర్ కూడా రూపొందించామని రాష్ట్రంలో 9 మెగా ఈవెంట్లు, జిల్లాల్లో 15 చొప్పున ఈవెంట్లు నిర్వహిస్తామని అజయ్ జైన్ చెప్పారు. విశాఖలో త్వరలోనే పార్టనర్స్ సమ్మిట్, 2026లో వైజాగ్ ఉత్సవాలు జరుగుతాయని, అరకు ఉత్సవాలు కూడా ఉంటాయని, ఆ మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అతి తక్కువ కాలంలో ఫెస్టివల్ నిర్వహించామని, ప్రజలు బాగా సహకరించారని అన్నారు.

**వైజాగ్ లో ప్రతి నెలా ఒక ఈవెంట్**

ఇక నుంచి వైజాగ్ లో ప్రతి నెలా ఒక ఈవెంట్ నిర్వహిస్తామని, వచ్చే జనవరిలో వైజాగ్, భీమిలి ఉత్సవాలు ఉంటాయని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. 2026 ఫిబ్రవరిలో ఐ.ఎఫ్.ఆర్. ఉంటుందని చెప్పారు. సిటీ పరేడ్ కూడా నిర్వహిస్తామన్నారు. పర్యాటక రంగంలో వైజాగ్ కు పరిచయం అవసరం లేదని, వైజాగ్ పేరు చెప్పగానే టూరిజం గుర్తు వస్తుందని అన్నారు. ఈ మధ్యనే హాప్ అన్ హాఫ్ (డబుల్ డెక్కర్) బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. మరిన్ని కార్యక్రమాలు, చర్యల ద్వారా పర్యాటకానికి వైజాగ్ ను డెస్టినేషన్ గా చేస్తామని పేర్కొన్నారు. చాలా కాలం తర్వాత ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించాం... ఏమైనా పొరపాట్లు ఉంటే పెద్దమనసుతో క్షమించాలని, ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని ప్రజలను కోరారు. అనంతరం స్టార్ చెఫ్ పోటీల్లో విజేతులుగా నిలిచిన హోటల్స్ చెఫ్ లకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. తదుపరి అతిథులంతా ఫుడ్ స్టాళ్లను సందర్శించి వంటకాలను రుచి చూశారు. కార్యక్రమంలో టూరిజం శాఖ అధికారులు జె. మాధవి, జగదీష్, ఏపీ టూరిజం అధికారులు, ఫోరమ్ ప్రతినిధులు, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జయహో కలాం ప్రోమో ఆవిష్కరించిన ముఖ్య మంత్రి

## నెలరోజుల పాటు స్టూడెంట్స్ యునైటెడ్ నెట్వర్క్ ఆధ్వర్యంలో కలాం జయంతి ఉత్సవాలు




**భీమిలి, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05:**
స్టూడెంట్స్ యునైటెడ్ నెట్వర్క్ ఈ నెల 15 నుండి అక్టోబర్ 15 వరకు నెల రోజుల పాటు నిర్వహిస్తున్న "జయహో కలాం ఆప్ కో సలాం" మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి ఉత్సవాల ప్రోమోను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం రుషికొండ హెలిప్యాడ్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబ్దుల్ కలాం యువతకు,విద్యార్థి సమాజానికి సమాజానికి స్పూర్తి నింపిన మహోన్నత వ్యక్తి అని ఆయన ఆలోచనలను విద్యార్థి సమాజానికి చేరువ చేస్తున్న స్టూడెంట్స్ యునైటెడ్ నెట్వర్క్ ను అభినందించారు. స్టూడెంట్స్ యునైటెడ్ నెట్వర్క్ అధ్యక్షులు రాజేటి బసవ కృష్ణమూర్తి మాట్లాడుతూ కలలు కనండి ఆ కలలను సాకారం చేసుకోండి అంటూ విద్యార్థి సమాజంలో నూతన ఉత్తేజాన్ని అందించిన గొప్ప వ్యక్తి అబ్దుల్ కలాం అని, తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటి అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఘనత స్టూడెంట్స్ యునైటెడ్ నెట్వర్క్ కే దక్కుతుందని, ఈ నెలరోజులు పాటు ఉమ్మడి విశాఖ జిల్లాలో అబ్దుల్ కలాం ఆలోచనలు అనే అంశంపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని, విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో పది ప్రభుత్వ విద్యా సంస్థలలో అబ్దుల్ కలాం విగ్రహాలు ఏర్పాటు చేస్తాం అని తెలిపారు.



# ప్రతిభావంతులైన విద్యార్థులకు ఎమ్మెల్యే సాయం..

**ద్వారకాతిరుమల, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05**
ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నల్లజర్లలో గోపాలపురంనియోజకవర్గ శాసనసభ్యులు మద్దిపాటివెంకటరాజు ఒక విశేషమైన సేవా కార్యక్రమం నిర్వహించారు. తన జీతం మొత్తాన్ని వినియోగించి, ఇంటర్మీడియట్ పూర్తిచేసుకుని ఉన్నత విద్య కోసం ముందుకు సాగుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచితంగా ల్యాప్టాప్‌లు, ట్యాబ్‌లను అందజేశారు. విభాగాలలో ప్రథమ స్థానం సాధించిన 6 మంది విద్యార్థులకు లాప్‌టాప్‌లు, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేయడం జరిగింది. ప్రథమ స్థానం: ఆశ శ్రీ, ద్వితీయ స్థానం: రమణ నీలి మేఘన, చరణ సాయి పవన్, ప్రథమ స్థానం:. దుర్గాభవానిద్వితీయ స్థానం: నిర్మల కుమారి, ప్రథమ స్థానం: ఎమ్మీ కారుణ్య ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,విద్యార్థులు ఉన్నత విద్యలో ముందుకు వెళ్లి సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా తీర్చిదిద్దుకోవాలని నా ఆకాంక్ష. వారి కృషి, ప్రతిభ ఎల్లప్పుడూ నాకు ప్రేరణగా ఉంటుంది. ప్రతిభావంతులైన విద్యార్థులకు సహాయం చేయడం నా కర్తవ్యంగా భావిస్తున్నాను అని అన్నారు. ప్రతి పేద విద్యార్థికి నేను అండగా ఉంటాను అని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శశి విద్యాసంస్థల చైర్మన్, బూర్గుపల్లి వేణుగోపాలకృష్ణ , ద్వారకాతిరుమల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు లంకా సత్యనారాయణ , దేవరపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆండ్రుఅనిల్ , గోపాలపురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొర్లపాటి రాము , ప్రతిభావంతులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఇ ఐ సి క్యాంపియన్ హెచ్ ఐ వి ఎయిడ్స్ పై అవగాహన



**పీలేరు ఇన్చార్జి సెప్టెంబర్ 5 సిటిజన్ టైమ్స్.**

హెచ్ఐవి/ ఎయిడ్స్ పై అవగాహన సదస్సులో భాగంగా శు క్రవారం వాల్మీకిపురం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో డ్వాక్రాసంఘాల మహిళ సభ్యులకు హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ ఎలా వస్తుంది ఎలా రాదు, ఎయిడ్స్ వ్యాధికి వాల్మీకిపురం ప్రభుత్వ ఆసుపత్రిలో లింక్ ఏఆర్టి సెంటర్లో ఉచితంగా మందులు సరఫరా చేస్తారని ఐ సి టి సి కౌన్సిలర్ ఎస్ లోకేష్ అన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ హెచ్ఐవి పరీక్షలు చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని, మందుల వాడకాన్ని గురించి తెలుసుకొని, ఎయిడ్స్ మరియు హెచ్ఐవీల రోగులకు సలహాలు ఇవ్వాలని, ఐసీటీసీ కేంద్రంలో హెచ్ఐవి పరీక్షలు ఉచితంగా చేస్తారని ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని లోకేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఓ ఆర్ డబ్ల్యు శివ,మోహనకుమారి, శోభ, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## వంటేరు ప్రతాప్ రెడ్డిని పరామర్శించిన కేటీఆర్



**సిటిజన్ టైమ్స్ సెప్టెంబర్ 05జగదేవపూర్**

గజ్వేల్ ఇన్ ఛార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. జగదేవపూర్ మండలం లోని దౌలాపూర్ గ్రామంలో ప్రతాప్ రెడ్డి నివాసంలో కలిసిన కేటీఆర్ ప్రతాప్ రెడ్డి మాతృమూర్తి వజ్రమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారితో ఎంఎల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ,పాడికౌశిక్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

## ఘనంగా గణపతి ఊరేగింపు.





**ద్వారకాతిరుమల, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05**

ద్వారకాతిరుమల సంత మార్కెట్ అంగన్వాడీ కేంద్రం నాగేంద్రస్వామి పుట్ట వద్ద గణపతి నవరాత్రులు ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహించి తొమ్మిదవ రోజు స్వామివారి ఊరేగింపు ద్వారకాతిరుమల పురవీధుల్లో జరుపుకొని నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ వాణిజ్య సెల్ విభాగం అధ్యక్షులు ఇమ్మడి రత్నాజీ, ద్వారకాతిరుమల మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి రూపేష్ కుమార్, ద్వారక తిరుమల జనసేన పార్టీ అధ్యక్షులు కోట అంజిబాబు, ద్వారక తిరుమల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు గువ్వల మావుళ్ళ రావు, జనసేన పార్టీ వీర మహిళ విభాగం మనుబోలు అరుణ్ కుమారి పాల్గొన్నారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న డాక్టర్ గోపీ నాథ్

**జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందు కున్న డాక్టర్ గోపీనాథ్.**

**మొన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేషనల్ ఫెలోషిప్ అవార్డు.**

**ఒక్కరు మారినా చాలు ఫౌండేషన్ ఫౌండర్, డాక్టర్ గోపీనాథ్.**



**స్టేట్ బ్యూరో, సెప్టెంబర్ 5. (సిటిజన్ టైమ్స్)**

మహబుబాబాద్ జిల్లా గూడూరు మండలం పాటి మీదిగూడెం లో టీచర్ గా విధులు నిర్వహిస్తున్నటువంటి డాక్టర్ వాంకుడోత్ గోపీనాథ్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ న్ జన్మదిన సందర్భంగా జరుపుకునేటువంటి ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డును ఇతను బోధిస్తున్నటువంటి తీరుతెన్నులు సమాజసేవ కు గాను మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, జిల్లా విద్యాశాఖ అధికారి దక్షిణామూర్తి , ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్రావు గార్ల చేతుల మీదుగా ఈరోజు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డును అందుకున్నారు.

ఈ ఉపాధ్యాయుడు పిల్లలకు వినూత్న రీతిలో పాఠాలు బోధిస్తూ చిన్ననాటి నుండే మనకు ఎదురయ్యే సమస్యలను ఏ విధంగా పరిష్కరించుకోవాలి. సమాజంలో ఏ విధంగా ముందుకు నడవాలో చిన్ననాటి నుండే నేర్పిస్తూ తనదైన ముద్ర వేసుకుంటూ తన వృత్తి ధర్మంతో పాటు ఒక్కరు మారినా చాలు ఫౌండేషన్ ఏర్పాటు చేసుకొని తన జీతం నుండి కొంత భాగాన్ని ప్రతి నెల వెచ్చిస్తూ పిల్లలుకు , పేద విద్యార్థులకు కావలసినవి అందిస్తూ సమాజంలో తనకంటూ ఒక ముద్ర వేసుకొని ప్రభుత్వ ఉపాధ్యాయుడు కేవలం పాఠాలు కాకుండా అన్ని పనులు చేయగలరని సమాజంలో ప్రభుత్వ ఉపాధ్యాయుని గౌరవాన్ని రోజుకు పెంచుతున్నాడు.ఈ సందర్భంగా డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ, గూడూరు మండల అధికారి రవికుమార్ కి హెడ్మాస్టర్ సుమలత మేడం కి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలుపుతూ, మనం కష్టాన్ని నమ్ముకుని మన అనుకున్నా లక్ష్యం వైపు అడుగులు వేస్తూ ఉంటే ఫలితమనేది దాని అంతట అదే వస్తుందని, నేను వచ్చి పోవడానికి కాదు ఇచ్చి పోవడానికి వాక్యాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగుతున్నానని, ఉపాధ్యాయుడు అనేవారు కేవలం నాలుగు గోడల మధ్యలో పాటలు బోధించడమే కాకుండా విలువలతో కూడిన విద్యను అందించాలని, ముఖ్యంగా సమాజంలో వారికి అవగాహన కల్పించాలని, విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించే విధంగా చిన్నప్పటినుండి వారికి ఉత్తేజపరుస్తూ వినూత్నమైన రీతులలో పాఠాలు బోధిస్తే పిల్లలు ఆసక్తికరంగా వింటారని దానిని ఆచరణలో పెడతారని దానివల్ల సత్ఫలితాలు ఇస్తాయని అన్నారు.నేను భవిష్యత్తులో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయు అవార్డు అందుకోవాలని అదే లక్ష్యంగా పెట్టుకున్నానని అన్నారు..



# ఖైరతాబాద్ గణపతిని దర్శించుకున్న సీఎం రేవంత్ రెడ్డి!




**సిటిజన్ టైమ్స్ హైదరాబాద్:సెప్టెంబర్ 05**

కొన్ని ఏళ్ల క్రితం ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ సమితి ఒకే ఒక్క అడుగు గణపతిని ప్రతిష్టించుకుని ఉత్సవా లను ప్రారంభించింది అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి, ఒకసారి నిర్వహణే కష్టమైనా ఈ రోజుల్లో ఎన్ని ఇబ్బందులు వచ్చినా వాటిని తట్టుకుంటూ ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ సమితి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తుందన్నారు.ఖైరతాబాద్ గణేశుడికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఖైరతాబాద్ వినాయకుడిని శుక్రవారం సిఎం రేవంత్ దర్శించుకున్నారు. మహాగణపతికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడారు. వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజలు ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలు నిర్వహించు కోవాలని సూచించారు. మతసామరస్యానికి హైదరాబాద్ ప్రతీక అని, ఉత్సవాలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నా రు.ఒక్క అడుగు ప్రారంభ మైన ఖైరతాబాద్ గణేషు డు, ఇప్పుడు ఈ స్థాయికి చేరుకున్నాడని ప్రశంసించా రు. నగరంలో ఎన్ని విగ్రహాలు ఉన్న ఖైరతాబాద్ వినాయ కుడి పోటీ రారని తెలియజేశారు. ఎన్ని ఇబ్బందులున్నా ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ ముందుకు వెళ్తోంద ని రేవంత్ కొనియాడారు. నగరంలో లక్షా 40 వేల విగ్రహాలు ఉన్నాయని, గణనాథులకు అన్ని రాకల ఏర్పాటు చేస్తున్నామని, దేశంలో ఎక్కడా లేని విధంగా హైదరాబాద్ మహానగరం లో ఎక్కువ గణపతులను పూజించు కుంటున్నామని రేవంత్ పేర్కొన్నారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి ఖైరతాబాద్ మహా గణపతి శోభాయాత్ర ఘనంగా జరుగనుంది. రేపు ఒంటి గంటకు హుస్సేన్ సాగర్ లో క్రేన్ నంబర్ 4 వద్ద ఖైరతా బాద్ మహా గణపతిని నిమజ్జనం చేయనున్నారు.


# యూరియా కోసం జుట్లు పట్టుకుని కొట్టుకున్న మహిళా రైతులు

**సిటిజన్ టైమ్స్ మహబూబాబాద్ జిల్లా:సెప్టెంబర్ 05**



మహిళలు ఆర్టీసీ బస్సుల్లో జుట్లు జట్లు పట్టుకొని కొట్టుకోవడం చూసాం%లల% కానీ ఇప్పుడు యూరియా కోసం పది రోజుల నుండి నిరీక్షిస్తున్న మహిళలు ఒక్క బస్తా కోసం పొట్టు పొట్టు రోడ్డుపై చెప్పులతో కొట్టుకు న్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నడిరోడ్డుపై మహిళ రైతులు శిఖలు పట్టుకొని తన్నుకోవడం సంచలనంగా మారింది. తెలంగాణ జిల్లాలో యూరియా కొరత తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తుంది.. గురువారం మహబూబా బాద్ జిల్లా కేంద్రంలో రైతులు గ్రోమోర్ సెంటర్ పై రాళ్లదాడి చేసి అక్కడ నిప్పుపెట్టారు.. ఆ సంఘటన మరువకముందే శు క్రవారం మరో ఘటన చోటు చేసుకుంది. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వివేకానంద సెంటర్ లో ఆగ్రోస్ కేంద్రం వద్ద యూరియా బస్తాల కోసం తెల్లవారుజాము నుండే మహిళలు, రైతులు గంటల తరబడి బారులు తీరారు.. ఈ క్రమంలో క్యూ లైన్ లో సహనం కోల్పో యిన ఇద్దరు మహిళ రైతులు క్యూ లైన్ లో రైతులంతా చూస్తుండగానే జుట్లు పట్టుకొని చెప్పులతో కొట్టుకున్నారు. ప్రధాన రహదారిపై పొర్లాడుతూ కొట్టుకోవడం అందర్నీ విస్మయానికి గురిచేసింది. చుట్టుపక్కల వారు ఆపుతున్నా ఆగకుండా ద్దరూ పొట్టు పొట్టు కొట్టుకున్నారు. చివరకు ఇద్దరు వ్యక్తులు ధైర్యం చేసి ఆ ఇద్దరు మహిళలను బలవంతంగా ఆపారు. సమయానికి యూరియా దొరకకపోవడం తో పంటల విషయంలో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆరోపించారు. ప్రభుత్వాలు మారిన రైతుల తలరాతలు మాత్రం మారలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

# భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు



**భట్టిప్రోలు, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05**

మహమ్మద్ ప్రవక్త జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని భట్టిప్రోలు మండలంలోని ముస్లిం సోదరులు మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని శు క్రవారం అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భట్టిప్రోలు,అద్దేపల్లి, వెల్లటూరు,పల్లికోన వేమవరం తదితర గ్రామాలలోని మసీదుల వద్ద ముస్లిం సోదరులు ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం సోదరులు, హిందువులు,క్రైస్తవ సోదరులు ఒకరినొకరు పండుగ శుభాకాంక్షలు తెలియపరచుకుని మతసామరస్యానికి ఆదర్శంగా నిలిచారు.

## సెప్టెంబర్ 5 పర్వదినం.. సర్వేపల్లి నీ స్మరించుకుందాం.

**భట్టిప్రోలు, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05**

సెప్టెంబర్ 5 గురుపూజోత్సవం పర్వదినాన స్ఫూరణకు వచ్చే వారిలో సర్వేపల్లి డా.రాధాకృష్ణన్ ఒకరు.వీరు 1962 నుండి 1967 వరకు భారతదేశానికి రెండవ రాష్ట్రపతిగా పనిచేసిన భారతీయ రాజకీయవేత్త, తత్వవేత్త, రాజనీతిజ్ఞుడు.అతను గతంలో 1952 నుండి 1962 వరకు భారతదేశానికి మొదటి ఉపరాష్ట్రపతిగా పనిచేశాడు.అతను 1949 నుండి 1952 వరకు సోవియట్ యూనియన్‌లో భారతదేశానికి రెండవ రాయబారిగా ఉన్నాడు.ఆయన 1939 నుండి 1948 వరకు బనారస్ హిందూ విశ్వవిద్యాలయానికి నాల్గవ వైస్-ఛాన్సలర్‌గా, 1931 నుండి 1936 వరకు ఆంధ్ర విశ్వవిద్యాలయానికి రెండవ వైస్-ఛాన్సలర్‌గా కూడా ఉన్నారు. రాధాకృష్ణన్ తులనాత్మక మతం, తత్వశాస్త్రం యొక్క 20వ శతాబ్దపు అత్యంత ప్రభావవంతమైన, విశిష్టమైన,పండితులలో ఒకరిగా పరిగణించబడ్డాడు. అతను కలకత్తా విశ్వవిద్యాలయంలో కింగ్ జార్జ్ వి చైర్ ఆఫ్ మెంటల్ అండ్ మోరల్ సైన్స్‌లో 1921 నుండి 1932 వరకు,ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలోని స్పాల్డింగ్ చైర్ ఆఫ్ ఈస్టర్న్ రెలిజియన్ అండ్ ఎథిక్స్ కు1936 నుండి 1952 వరకు తన సేవలనందించారు. భారతీయ తాత్వికచింతనలో పాశ్చాత్య తత్వాన్ని ప్రవేశ పెట్టారని ప్రతీతి. రెండు పర్యాయాలు ఉపరాష్ట్రపతి పదవి చేపట్టి,తరువాత రాష్ట్రపతిగా ఒక పర్యాయం పదవిని చేపట్టి,భారతదేశపు అత్యంత క్లిష్టకాలంలో (చైనా,పాకిస్తాన్లతో యుద్ధ సమయం) ప్రధానులకు మార్గనిర్దేశంగా ఉన్నారు.

# టిడిపి కార్యాలయంలో ఘనంగా టీచర్స్ డే వేడుకలు

## ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన సన్మాన కార్యక్రమం









**నరసరావుపేట , సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05**

నరసరావుపేట తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం నాడు టీచర్స్ డే వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా హాజరై, నియోజకవర్గంలోని విద్యాబోధన రంగంలో విశేష సేవలందిస్తున్న ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ కొల్లి బ్రహ్మయ్యను ప్రత్యేకంగా సన్మానించారు. అలాగే నియోజకవర్గంలోని పలువురు మహిళా ఉపాధ్యాయులను కూడా శాలువాలు, స్మారక చిహ్నాలతో గౌరవించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తమ సేవలకు గుర్తింపుగా ఈ సన్మానాన్ని స్వీకరించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. టీచర్స్ డే సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ భారత తొలి ఉపరాష్ట్రపతి మరియు రెండవ రాష్ట్రపతి అయిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలను కొనియాడారు. ఆయన 1888 సెప్టెంబర్ 5న జన్మించారని, విద్యారంగంలో ఆయన చేసిన కృషి అనన్యమైనదని అన్నారు. కలకత్తా, ఆక్స్‌ఫర్డ్ వంటి ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్‌గా పనిచేసిన రాధాకృష్ణన్, తన ఉపన్యాసాల ద్వారా ప్రపంచవ్యాప్తంగా విద్య యొక్క ప్రాముఖ్యతను చాటారని వివరించారు. 1962లో రాష్ట్రపతిగా ఉన్న సమయంలో ఆయన జన్మదినాన్ని టీచర్స్ డేగా జరుపుకోవాలని సూచించిన సంగతిని గుర్తు చేశారు. ఉపాధ్యాయులను సమాజ రూపకర్తలుగా, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే వారిగా గౌరవించే సందర్భమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యాసంస్థల ప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రోడిజి విద్యాలయ్‌లో ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు







**బాపట్ల, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05**

మెరుగైన సమాజ ఏర్పాటులో గురువుదే కీలక పాత్రని,సమాజంలో ప్రతి ఒక్కరితో పూజింపబడేది గురువేనని ప్రోడిజి విద్యాలయ్ ప్రిన్సిపాల్ బ్రజేశ్ కానున్ గో అన్నారు.బాపట్ల మండలంలోని మత్సపురి కాలనీ కనకాద్రి నగర్లో ప్రోడిజి విద్యాలయ్ సీబీఎస్ఈ పాఠశాలలో గురుపూజోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.పాఠశాలలోని ఉపాధ్యాయులకు విద్యార్థులు పాదపూజ చేశారు.విద్యార్థులను ఉపాధ్యాయులు ఉన్నతంగా ఎదగాలని ఆశీర్వదించారు. గురువులను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థి ఉన్నతికి ఉపాధ్యాయులు విశేష కృషి చేయాలని కరస్పాండెంట్ మాచాబత్తిని శ్రీనివాసరావు సూచించారు. ఉపాధ్యాయులకు బహుమతులను డైరెక్టర్లు శ్రీనివాసరావు, పార్థసారథి,ఉదయచంద్రరావు లు అందజేశారు. అనంతరం పాఠశాలలో వినాయక చవితి సంధర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద ఉంచిన వినాయక లడ్డును బొడ్డు రవిదేవరాజు, చింతకాయల శ్రీధనుష్ లు 10 వేలకు పాటలో దక్కించుకున్నారు.అనంతరం వినాయకుడికి విద్యార్థులు, ఉపాధ్యాయులు వినాయకుని భారీ ఊరేగింపుతో తీసుకెళ్ళి ముత్తాయపాలెం కాల్వలో నిమజ్జనం చేశారు.ఈ కార్యక్రమంను ప్రిన్సిపాల్ బ్రజేశ్ కానున్ గో ,వరలక్ష్మి లు పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మజ,బాబూరావు,శ్రీనివాసరెడ్డి, సునీల్,మౌనిక,నీలిమ తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణవేదిక పై అంతస్థుకు శంకుస్థాపన



**భట్టిప్రోలు, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05**

మండల కేంద్రమైన భట్టిప్రోలు గ్రామపంచాయతీ పరిధిలోని అద్దెపల్లి శ్రీరామ నామ క్షేత్రం ఆవరణలో నిర్మించిన కల్యాణవేదిక పై భాగాన రెండవ అంతస్తు నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన నిర్వహించారు. రామనామ క్షేత్రం కమిటీ అధ్యక్షులు కొన్నిపాటి భాస్కరరావు చేశాకుస్థాపన జరిగింది.ప్రముఖ వాస్తు సిద్ధాంతి వంగర చలమయ్య సిద్దాంతి నేత్రుత్వంతో పూజలు శాస్త్రృత్తంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కాగిత దుర్గాప్రసాద్, కాగిత మారుతి కుమార్,కాగిత ఆంజనేయులు,కొన్ని పాటి లోకానంద్,కొన్ని పాటి సత్యనారాయణ, పోనుగుపాటి శివ నాగలక్ష్మి పలువురు భక్తులు పాల్గొన్నారు.

## అవార్డును అందుకున్న రోజా రమణి

**భట్టిప్రోలు, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05**

భట్టిప్రోలు మండలంలో వెల్లటూరు పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న ఓలేటి రోజా రమణి శుక్రవారం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా శుక్రవారం అందుకున్నారు.బాపట్ల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రధాన ఉత్సవం బాపట్లలోని అన్నం సతీష్ ప్రభాకర్ కాపు కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించడమైంది. బాపట్ల శాసనసభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమం నందు బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్,పోతుల సునీత కలెక్టర్ జె.వెంకట మురళి,డీఈవో ఎస్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ఓలేటి రోజా రమణి ఉత్తమ ఉపాధ్యాయులుగా జిల్లా అవార్డును అందుకున్నారు.



## విద్య అవసరాన్ని చాటిచెప్పిన స్ఫూర్తి ప్రదాత సర్వేపల్లి రాధాకృష్ణన్ వెలగలేటి గంగాధర్..







**గుంటూరు, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05**

నేటికి సరిగ్గా మా విద్యాబ్యాసం మొదలు పెట్టి అర్ద శాతబ్దం 50 సంవత్సరాలు పూర్తయిన సందర్బంగా మొట్ట మొదట మేము ఒకటవ తరగతి నుండి అయిదవ తరగతి వరకు విద్యాబ్యాసం చేసిన అరండల్ పేట 16వ లైనులో గల ఆర్.సి.యం ప్రాథమిక పాఠశాల నందు మాకు చదువు చెప్పిన గురువులు ఇందిర టీచర్ సుశీల టీచర్ ని మరియు ఇప్పుడు పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఉపాధ్యాయ దినోత్సవం సందర్బంగా అరండల్ పేటలో 16వ లైనులో గల ఆర్.సి.యం ప్రాథమిక పాఠశాల నందు నాతో చదువుకున్న మిత్రులతో కలసి వారిని పుష్పగుచం ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది అదేవిదంగా అక్కడ చదువుచున్న పిల్లలకు పండ్లు మిఠాయిలు బిస్కెట్లు పంపిణి చేయటం జరిగింది ఈసందర్బంగా పూర్వ విద్యార్థి వెలగలేటి గంగాధర్ మాట్లాడుతూ దేశానికి మొట్ట మొదటి ఉప రాష్ట్రపతి మరియు రెండవ రాష్ట్రపతి, గొప్ప విద్యావేత్త మరియు భారతదేశ వారసత్వ అస్తిత్వాని కాపాడడం కోసం విద్య అవసరాన్ని చాటిచెప్పిన స్ఫూర్తి ప్రదాత సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్బంగా ఈరోజు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు. 5 సెప్టెంబర్ అంటే చిన్నతనంలో మనకు విద్యాబుద్ధులు నేర్పే మాష్టర్ కి గురుపూజ చేస్తూ అయ్యవారికి నూరు వరహాలు పిల్లవానికి చాలు పప్పు బెల్లాలు.అనే మాట గుర్తుకు వస్తుందని, గురువులు కేవలం జ్ఞానాన్ని బోధించడమే కాకుండా సమాజాన్ని సన్మార్గంలో నడిపించే మహనీయులని తెలిపారు. ఉపాధ్యాయులను సన్మానించిన వారిలో పూర్వ విద్యార్థులు నీలం సతీష్ బాబు, బోరుగడ్డ పాల్ ప్రదీప్ కుమార్, పెనుమూడి వేణుగోపాల్, గుమ్మడి ఆనంద్ కుమార్, వెలగలేటి గంగాధర్, గోరంట్ల మధు, చిన్నం పద్మాకరు, తుమ్మేటి కృష్ణ, ఆంజనేయులు, తల్లం రమేష్, మునగ గణపతి, సుబ్రహ్మణ్యం, బట్రాజ్ కృష్ణ కిషోర్, ఎల్లంపల్లి సంతోష్ కుమార్, హెడ్ మిసెస్ విజయరాణి, సీనియర్ టీచర్ రాజేశ్వరిదేవి, షర్మిల మరియు టీచర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

## బీచ్ ఫెస్టివల్ ను అంగరంగ వైభవంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి



**బాపట్ల సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05**

బీచ్ ఫెస్టివల్ నిర్వహణపై అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులతో శుక్రవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్ లో ఆయన సమీక్ష నిర్వహించారు. దక్షిణ భారత స్థాయిలో బీచ్ క్రీడా పోటీలు నిర్వహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈనెల 26, 27, 28 తేదీలలో బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఫెడ్ లైట్ల మధ్య వాలీబాల్, కోకో, బాక్సింగ్, ఫెన్సింగ్ వంటి క్రీడా పోటీలు భారీ స్థాయిలో నిర్వహించాలన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పండుగలా జరపాలని ఆయన సూచించారు. సూర్యలంక రామాపురంలో ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు. పర్యాటకుల సౌకర్యార్థం 100 ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల కొరకు తెలుగు సినీ రంగం నుండి కళాకారులను పిలిపిస్తున్నట్లు చెప్పారు. మధ్యలో కొంత సరదాగా ఉండడానికి జబర్దస్త్ బృందాల ప్రదర్శన ఏర్పాటు చేయాలన్నారు. గొప్ప గాయకులు ఈ పోటీలకు హాజరుకానున్నారన్నారు. సినీ రంగ నటులు, కథానాయకురాలు, ప్రముఖుల సైతం ఈ కార్యక్రమానికి వస్తున్నారని వివరించారు. డాన్సర్లు, మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేయాలన్నారు. తీర ప్రాంతంలో బోట్ల ప్రదర్శన, స్పీడ్ బోట్లు, స్పోర్ట్స్ రైడర్స్, గుర్రాలు, ఒంటెలు ప్రదర్శన ఉంచాలన్నారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. 350 మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. వేలాదిమంది కార్యక్రమానికి హాజరయ్యేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, జిల్లా పర్యటకశాఖ అధికారి నాగిరెడ్డి, ఆర్డీవో గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, కలెక్టరేట్ ఏవో మల్లికార్జున రావు, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రానికి కుర్చీల బహుకరణ.

**బట్టిప్రోలు, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05**

మండల కేంద్రమైన భట్టిప్రోలు లోని అంగనవాడి కేంద్రము నకు నాలుగు కుర్చీల ను బహుకరించారు. శుక్రవారం భట్టిప్రోలు గ్రామానికి చెందిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత,యునేస్కో అవార్డు గ్రహీత బొలిశెట్టి. శ్రీనివాసరావు వాసవిక్లబ్ భట్టిప్రోలు గవర్నర్ పులికొండ శ్రీనివాసరావు,ప్రమీల రాణిల ఆఫీషియల్ విజిట్ సేవా కార్యక్రమం లొ భాగంగా గవర్నర్ చేతుల మీదుగా కుర్చీలను అంగన్ వాడి ఉపాధ్యాయులకు అంద చేశారు.ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు బూర్లే చంద్రశేఖర్,నంబూరు నాగభూషణరావు, చన్న వెంకట ఉమామహేశ్వరరావు, కూరాళ్ళ రవికుమార్, బూర్లే రామప్రసాదు, అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా కత్తెర హెని క్రిస్టినా





**గుంటూరు, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05**

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెని క్రిస్టినా. గుంటూరు జిల్లా నందు జరుగుచున్న ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జెడ్పీ చైర్మన్ క్రిస్టినా మాట్లాడుతూ అందరికీ ఉపాధ్యాయ దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు, ఇప్పుడు ప్రపంచం లో పేరొందిన గొప్ప వ్యక్తులు, పరిపాలకులు, శాస్త్రవేత్తలు కలెక్టరులు వారి జీవితాల్లో ఇంత అభివృద్ధి చెందారు అంటే ఆ ఘనత వారి ఉపాధ్యాయులదీ అని తెలియజేశారు, కూటమి ప్రభుత్వం లో చంద్రబాబు ఆధ్వర్యం లో విద్య వ్యవస్థ ఎంతో అభివృద్ధి చెందుతుంది అని తెలియజేశారు. ఉత్తమ ఉపాద్యాలుగా ప్రతిభ పురస్కారం పొందుకుంటున్న ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గుంటూరు జిల్లా నందు గల 52 మంది అర్హులైన ఉపాధ్యాయులకు, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు జెడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా చేతుల మీదగా అందించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు పచ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి , పట్టభద్రుల ఆలపాటి రాజా , గుంటూరు కమిషనర్ పులి శ్రీనివాస్ , డిప్యూటీ మేయర్ షేక్ సజీలా , ఏ పి టి ఎస్. చైర్మన్ మన్నవ మోహన కృష్ణ గుంటూరు జిల్లా డి.ఈ.ఒ పాల్గొన్నారు.

## విశ్వకర్మ స్ఫూర్తి లెజెండరీ పురస్కారముకు ఎంపికైన పొన్నెకంటి శ్రీనివాసాచారి

**గుంటూరు,సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05**



శ్రీ విరాట్ విశ్వకర్మ విజ్ఞాన ఆధునిక ధార్మిక కళాపరిషత్ జాతీయ సాహితీ సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ మరియు తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో 17 సెప్టెంబర్ 2025 విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో కృషి చేసిన వారిని గుర్తించి ప్రతి సంవత్సరం విశ్వకర్మ జాతీయ పురస్కారాల కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది ఈ సంవత్సరానికి గాను ఆంధ్రప్రదేశ్ పల్నాడు జిల్లా పిడుగురాళ్ల కు చెందిన పొన్నెకంటి శ్రీనివాసాచారి కి విశ్వకర్మ స్ఫూర్తి లెజెండరీ జాతీయ పురస్కారానికి ఎంపిక చేయడం జరిగినదని కార్యనిర్వహణ కమిటీ అధ్యక్షులు బ్రహ్మశ్రీ డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి చైర్మన్ బ్రహ్మశ్రీ పోలోజు రాజ్ కుమార్ చార్యులు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ పురస్కారాన్ని తెలంగాణ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో తేదీ14 సెప్టెంబర్ 2025 ఆదివారం రోజున ఉదయం 10 గంటలకు వేదిక శ్రీరాజ్యలక్ష్మి కన్వెన్షన్ హాల్‌లో ముఖ్య అతిథుల చేతుల మీదుగా పురస్కారాన్ని ప్రధానం చేయనున్నట్లు తెలిపారు.

# పార్టీ ప్రధాన నాయకులం అని చెప్పుకోవడం సరిపోదు..

## నిజాయితీగా పార్టీలో పని చేయడం ముఖ్యం

## " ఎస్సీ తెదేపా నాయకుల సూటి ప్రశ్న"







**పెళ్లకూరు, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05**

కూటమి ప్రభుత్వం అన్ని సామాజిక వర్గాలను పార్టీ పరంగా దగ్గర తీసుకుంటూ పార్టీలో అభివృద్ధికి పాటుపడిన వారికి కులరహితంగా గుర్తిస్తుంటే నేడు సూళ్లూరుపేట ఎస్సీ నియోజకవర్గంలోని పెళ్లకూరు మండల తెలుగుదేశం పార్టీలో కొందరు అగ్రవర్ణ సీనియర్ నాయకుల మంటూ పెత్తనం చేయడం మానుకోవాలని మండల పరిధిలోని ఎస్సీ సామాజిక వర్గ అగ్రవర్ణ నేతలను సూటిగా ప్రశ్నిస్తున్నారు. పార్టీ ఏర్పాటు నాటినుండి నేటి వరకు ఎస్సీ, బిసి, సామాజిక వర్గాలతో కలసి మెలసి ఉన్న పార్టీ నాయకులు కొందరు ఎస్సీ బీసీలపై లేనిపోని అబాండాలు మోపుతూ, విస్మరించడం పై తీవ్రంగా మండిపడ్డారు. మండల పరిధిలోని, కొందరు టిడిపి నాయకులు ఇన్చార్జి మంత్రిగా కొనసాగుతున్న రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ను కలసి నియోజకవర్గ ఎమ్మెల్యే, ఇంచార్జ్ పనితీరు బాగా లేదన్నట్లు లేనిపోని విషయాలను మంత్రికి తెలపడం వెనుక ఆంతర్యం ఏమిటని దీనిపై శుక్రవారం దళిత నాయకులు పత్రికా సమావేశంలో చర్చించారు. కులం ఉంటే సరిపోదు, అందుకు అనుగుణంగా మెలగాలి. ఏ పార్టీ ఆ పార్టీ గొడుగు కింద చేరి ద్వంద్వ రాజకీయాలు చేయడం మా వల్ల కాదని, మేము ఇప్పుడు ఎప్పుడు నీతి నిజాయితీగా ఒకే పార్టీని నమ్ముకుని ఉన్నామని వారు వెల్లడించారు. ఆనాడు చిల్లకూరు జడ్పిటిసి అభ్యర్థి పోటీ విషయంలో వైయస్సార్ అభ్యర్థికి పోటీగా తెలుగుదేశం అభ్యర్థిని ఎందుకు నిలబెట్టే లేకపోయారని నిలదీశారు. ఆనాడు ఆ గ్రామంలో ఉన్న రాజారెడ్డి మాత్రమే వైసిపి నాయకునికి ఎదు రొడ్డి నిలిచారే తప్ప, మండలంలో ఎంపీటీసీ పోటీ విషయంలో కూడా ఆ నాయకులు ఆనాడు ఏమయ్యారని ప్రశ్నిస్తున్నారు. పార్టీ లో కుల రాజకీయాలు మానుకోవాలని, ఆ ఎస్సీ కులస్తులే ఎన్నికల్లో ప్రచారాలకు, బూత్ వద్ద ముందుండాలి, కానీ అభివృద్ధి పనులు మాత్రం మీరే చేయాలా! ఎంత కుల రాజకీయాలు చేస్తున్నారంటూ విమర్శించారు. ఆనాడు మాజీమంత్రి పరస వెంకటరత్నంపై పెళ్లకూరులో ఆయన వాహనంపై వైసీపీ నాయకులు దాడి చేసినప్పుడు అగ్రవర్ణ ప్రధాన నాయకులు ఎందుకు ముందుకు రాలేదని గుర్తు చేశారు. సులూరుపేట నియోజకవర్గం ఎమ్మెల్యేగా నెలవల విజయశ్రీ, ఇంచార్జి నెలవల సుబ్రహ్మణ్యం ఎస్సీ కులమునకు చెందినవారుగా వారు కుల రహిత అభివృద్ధి చేయాలని చూస్తుంటే! కొందరు. కుల విభజన రాజకీయాలకు పాల్పడుతూ! మేము చెప్పింది జరగాలి! మేము చేయమన్నది చేయాలన్నట్లుగా కుళ్ళు రాజకీయాలు మానుకోవాలన్నారు. కుల విభజన చేస్తూ ఎస్సీ బీసీలను విడదీయాలని చూస్తే ఆ నాయకులకు గ్రామాల్లో విలువలు కోల్పోతారని సూచించారు. ఇలాంటి కుయుక్తి రాజకీయాలు మానుకొని పార్టీ అభివృద్ధికి పాటుపడలే కానీ వెన్నుపోటు రాజకీయాలు చేయడం మానుకోవాలని ఎస్సీ నాయకులు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఏ ఎం సీ ఉపాధ్యక్షుడు పోలయ్య, మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు డి ఎస్, పెళ్లకూరు మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు రాపూర్ పరుశురాం, మాజీ జడ్పిటిసి వేలూరు రమణయ్య, మారాబత్తిన గురవయ్య, కె విజయభాస్కర్, ఎం.రవి, రమణయ్య, మెరూం చంద్ర, జనసేన నాయకుడు తాళ్ల రెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు.

## ర్యాలీ లో పాల్గొన్న ఎమ్మెల్యే.





**కావలి, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05**

కావలి పట్టణంలో శుక్రవారం మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ముస్లింలు, హిందూ సోదర సోదరీమణులు కలిసి ఐక్యతకు నాంది పలికే ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ శాంతియుత వాతావరణంలో, మత సామరస్యానికి నిదర్శనంగా ఘనంగా సాగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, ముస్లిం సోదరులందరికీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జననం మానవాళికి మార్గదర్శకంగా నిలిచిందన్నారు. ఆయన బోధనలు కేవలం ముస్లింలకే కాకుండా ప్రపంచ సమాజానికీ ఒక వెలుగుదీపమన్నారు. పవిత్ర ఖురాన్ రచన ద్వారా ఇస్లాం మతానికి, ఆచార సంప్రదాయాలకు నూతన దారిని చూపించారన్నారు. ఆయన జీవితమే త్యాగం, క్రమశిక్షణ, శాంతి, సహనం పాఠాలను మనకందించిందన్నారు. అదే విధంగా భారతదేశం అనేది హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మరియు అన్ని మతాలు కలసికట్టుగా జీవించే దేశమన్నారు. ఖురాన్, భగవద్గీత, బైబిల్ మానవ సమాజానికి శ్రేయస్సు చెప్పే గ్రంథాలన్నారు. కావలి పట్టణంలో ముస్లిం సోదరులు ఎంతో భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉత్సవాన్ని నిర్వహించడం సర్వమత సామరస్యానికి ప్రతీకని ఎమ్మెల్యే అన్నారు. ముస్లిం సోదరుల ఆహ్వానం పట్ల కృతజ్ఞతలు తెలుపుతూ, అందరూ పరస్పరం ప్రేమ, గౌరవాలతో జీవించాలని, సమాజంలో ఐక్యతను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, స్థానిక ప్రజలు, హిందూ సోదరులు, పట్టణ ప్రముఖులు విస్తృతంగా పాల్గొన్నారు.

# నాయుడుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బాలికల వసతి గృహ సముదాయంలో రోడ్డు నిర్మాణం



**నాయుడుపేట, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05**

నాయుడుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం సముదాయంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు ఆదివారం నాగ సొంత నిధులతో సుమారు 100 మీటర్ల గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో వసతి గృహ సముదాయం నీటితో నిండిపోయి విద్యార్థులు నడవలేని పరిస్థితుల్లో అధ్వానంగా ఉండేది. బాలికల వసతి గృహంలో రోడ్డు నిర్మించాలని నాయుడుపేట రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఏ నాగురయ్య దృష్టికి తీసుకుపోవడంతో స్పందించిన ఆయన తన సొంత నిధులతో రోడ్డు నిర్మించారు. ఈరోడ్డు ను శుక్రవారం రోటరీ క్లబ్ గవర్నర్ రవీంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాటరీ క్లబ్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బాలికల వసతి గృహ సముదాయంలో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఏ నాగూరయ్య, సెక్రటరీ బి సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, జె రాజగోపాల్, నాగలాపురం రామ్మోహన్, కృష్ణారావు, సోమశేఖర్, రామచంద్రారెడ్డి, హరిబాబు, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, సుజిత్, ప్రసాద్, శంకర్ లాల్ పలువురు ఉపాధ్యాయులు, హాస్టల్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తిలో క్రేన్ తో ఊరేగిన బొజ్జ గణపయ్య

**శ్రీకాళహస్తి, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05**


శ్రీకాళహస్తిలోని కొండమిట్ట ప్రాంతంలో వినాయక చవితి ఉత్సవాలు ముగిశాయి. తొమ్మిది రోజులు వివిధ రకాల పూజలు నిర్వహించారు. గురువారం రాత్రి నిమజ్జనానికి గణనాథుడిని తరలించారు. ఊరేగింపు వినూత్నంగా ఉండాలనే ఉద్దేశంతో కమిటీ నిర్వాహకులు క్రేన్ ఏర్పాటు చేశారు. దాని మీదే వినాయక స్వామిని ఊరేగించారు.



# ఏపీ మోడల్ స్కూల్, కమ్మనపల్లెలో 8 లక్షల విలువైన సదుపాయాలు

## సాహసి సమర్థ్ సేవ ట్రస్ట్, జీపీ స్ట్రాటజీస్ సంయుక్త వితరణ






**పలమనేరు, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05**

నియోజకవర్గ పరిధిలోని బైరెడ్డిపల్లి మండలం కమ్మనపల్లెలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థుల భవిష్యత్ అభివృద్ధి దృష్ట్యా సాహసి సమర్థ్ సేవ ట్రస్ట్ మరియు జీపీ స్ట్రాటజీస్ సంయుక్తంగా రూ.8 లక్షల విలువైన సదుపాయాలను శుక్రవారం అందించారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా 100 మంది హాస్టల్ విద్యార్థుల కోసం హాట్ వాటర్ గీజర్లు 7 టాప్స్‌తో ఏర్పాటు,7 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అసెంబ్లీ ఫ్లోర్ నిర్మాణం,పూర్తి స్థాయి ఇంటర్నెట్ సదుపాయం, అలాగే విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మరికొన్ని మౌలిక వసతులు కల్పించారు.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞత కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమానికి జీపీ స్ట్రాటజీస్ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ మండల్,సాహసి సమర్థ్ సేవ ట్రస్ట్ వ్యవస్థాపకులు సామ్ కోటేశ్వర్(ఆర్మీ), ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ రేణిత మేరీ,అడ్వకేట్ అపర్ణ పురకాయస్త, ట్రస్ట్ కార్యదర్శి భారతి సముగాళ్ళ పాల్గొన్నారు. ఇందులో ప్రిన్సిపాల్ డాక్టర్ అనిత మాట్లాడుతూ.. ట్రస్ట్ మరియు జీపీ స్ట్రాటజీస్ అందించిన సహకారం వలన విద్యార్థులు మరింత సౌకర్యవంతంగా చదువుకోగలరని ఆశాభావం వ్యక్తం చేసి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం, జీపీ స్ట్రాటజీస్ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ మండల్ విద్యార్థులను ప్రోత్సహిస్తూ భవిష్యత్‌లో దేశానికి తోడ్పడేలా కృషి చేయాలని కోరారు. ట్రస్ట్ ఫౌండర్ సామ్ కోటేశ్వర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఇప్పటి నుండే నిజాయితీతో సన్మార్గంలో నడవాలని,భవిష్యత్తు లో అవినీతి అనే దారిలో వెళ్లకూడదని సూచించారు.అలాగే విద్యార్థుల అభ్యున్నతికి భవిష్యత్‌లో మరెన్నో కార్యక్రమాలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం అనంతరం స్కూల్ యాజమాన్యం ట్రస్ట్ ప్రతినిధులు మరియు జీపీ స్ట్రాటజీస్ బృందాన్ని ఘనంగా సన్మానించింది.

# టెక్నాలజీని ఉపయోగించి ఏనుగుల కట్టడికి చర్యలు

## త్వరలో 50 హెక్టార్లలో కార్యరూపందాల్చనున్న ఎకోటూరిజం ప్రాజెక్టు

## రాష్ట్రంలోనే కుంకీ ప్రాజెక్టు చాలా ప్రతిష్టాత్మకమైనది -పర్యావరణ పరిరక్షణ... జంతు సంరక్షణకు కృషి



**పలమనేరు, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05**

ఏనుగుల దాడుల నుంచి పంట మరియు ప్రాణ నష్టాల నివారణకు ప్రభుత్వ పరంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు పలమనేరు శాసనసభ్యులు అమరనాథ రెడ్డి పేర్కొన్నారు.ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే కుంకీ ఏనుగుల ప్రాజెక్టు తీసుకురావడం జరిగిందన్నారు.త్వరలో టెక్నాలజీతో పాటు కుంకీల ద్వారా పూర్తిగా ఏనుగుల దాడులను నివారించనున్నామన్నారు. రైతుల పంటలకు నష్టం జరగకుండా ఏనుగుల కదలికలను గుర్తించే విధంగా చిప్ ల ఏర్పాటుతో పాటు, హ్యాంగింగ్ సోలార్ ఫెన్సింగ్, కుంకీ ఏనుగుల ద్వారా కట్టడి చేయనున్నామని వివరించారు.ఇంకా కుంకీ ఏనుగుల ప్రాజెక్టుకు ఎదురుగా 50 హెక్టార్లలో ఎకో టూరిజం ప్రాజెక్టు త్వరలో కార్యరూపం దాల్చనుందని దీంతో ఆదాయం పెరగడంతో పాటు ఉపాధి అవకాశాలు ఈ ప్రాంత వాసులకు రానున్నాయన్నారు. ఎన్నికల అనంతరం రాష్ట్రంలోనే కుంకి ఏనుగుల ప్రాజెక్టు ప్రతిష్టాత్మకంగా ఈ ప్రాంతంలో ఏర్పాటు కావడం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్టుతో ఓవైపు రైతులకు మేలు చేసుకుంటూ పర్యావరణ సమతుల్యాన్ని పాటించడమే గాక జంతు సంరక్షణ మరియు వాటి నుంచి దాడులను నివారించుకోవడం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.

**పంట,ప్రాణ నష్ట బాధితులకు పరిహారపు చెక్కుల పంపిణీ**

పలమనేరు అటవీ రేంజ్ పరిధిలో ఏనుగుల దాడులతో పంట,ప్రాణ మరియు ఆస్తి నష్టపోయిన 80 మంది బాధితులకు రూ 12.77 లక్షల విలువ చేసే చెక్కులను ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి ఈ సందర్భంగా పంపిణీ చేశారు.అందులో పంట నష్టపోయిన 78 మందికి రూ.7,02,840 పాడి ఆవు నష్టపోయిన ఓ రైతుకు రూ. 75 వేలు, ప్రాణనష్టం వాటిల్లిన బాధిత కుటుంబీకులకు రూ. 5 లక్షల పరిహారపు చెక్కులను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమాలలో సబ్ డి ఎఫ్ వేణుగోపాల్ రెడ్డి ఎఫ్.ఆర్.ఓ.నారాయణ లతో పాటు ఎఫ్.ఎస్.ఓ లు,సుకుమార్, సురేంద్ర,రమేష్,ఎఫ్ బీ.వోలు మరియు సిబ్బందితో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు కిషోర్ గౌడ, ఆనంద,సోమశేఖర్ గౌడ్,నాగరాజు రెడ్డి, కుట్టి,జనసేన నాయకులు దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఆశా జిల్లా కార్యవర్గం ఎన్నిక




**శ్రీకాళహస్తి, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05**

సీఐటీయూ అనుబంధ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా పి.లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా ఎం.కవిత, కోశాధికారిగా కే.ఉషలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆశాలు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల హక్కుల సాధన కోసం నూతన కార్యవర్గం సమరశీల పోరాటాలు చేస్తుందని అధ్యక్ష, కార్యదర్శులు స్పష్టం చేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ధనలక్ష్మి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, కార్యదర్శి పెనగడం గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే.



**కావలి, సిటిజన్ టైమ్స్, సెప్టెంబర్ 05**

కావలి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 31 మంది లబ్ధిదారులకు సంబందించిన రూ.18,07,248 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ వివిధ హాస్పిటల్స్ లో చికిత్స పొందిన వారు ముఖ్యమంత్రి సహాయ నిధి కొరకు మన కార్యాలయం నుండి దరఖాస్తు చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు 902 మంది దరఖాస్తు చేసుకోవడం జరిగిందని, 587 మందికి ఇప్పటివరకు చెక్కులు మంజూరు కావడం జరిగిందని తెలిపారు. మొత్తం రూ.5,44,41,980 ఇప్పటివరకు అందించడం జరిగిందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ పోతుగంటి అలేఖ్య, టీడీపీ కావలి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# స్పిరిట్ పై కొత్త ప్రచారం.. ప్రభాస్తో సందీప్ ఆ జానర్ సినిమా తీస్తున్నారా?

రెబల్ స్టార్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ.. ఫ్యాన్స్ ఎక్కువ మంచి వెయిట్ చేస్తుంది మాత్రం సందీప్ రెడ్డి వంగ స్పిరిట్ సినిమా కోసమే. ఈ సినిమా ఎప్పుడో కన్ఫార్మ్ అయినప్పటికీ.. ఇంకా పట్టాలెక్కలేదు. ప్రభాస్ వేరే ప్రాజెక్ట్ లతో హీజీగా ఉండడంతో స్పిరిట్ ఆలస్యం అవుతూ వస్తోంది. ప్రస్తుతం ప్రభాస్ రాజాసాబ్ సినిమా పెండింగ్ పాటల షూటింగ్ కోసం గ్రీస్ వెళ్లనున్నారు.ఈ షూటింగ్ పూర్తైన తర్వాత ఆయన స్పిరిట్ కు ఫుల్ టైమ్ కేటాయించనున్నారు. సెప్టెంబర్ లో షూటింగ్ ప్రారంభం కానుందని డైరెక్టర్ సందీప్ ఇప్పటికే చెప్పినా.. ఇంకా సమయం పట్టేలా ఉంది. ఈ క్రమంలో హిందీ మీడియాలో స్పిరిట్ జానర్, కథాంశంపై పలు ఆసక్తికర కథనాలు బయటకు వచ్చాయి. బాలీవుడ్ సినీ ప్రముఖ వెబ్ సైట్ హంగామా తన నివేదికలో ప్రభాస్ స్పిరిట్ గురించి రాసుకొచ్చింది. ప్రభాస్ హీరోగా సందీప్ స్పిరిట్ సినిమాను భయానకమైన హార్రర్ థ్రిల్లర్ గా రూపొందించనున్నారని.. ఇది అచ్చం ఎమ్ నైట్ శ్యామలన్ సినిమాలను పోలి ఉంటుందని రిపోర్ట్ లో పేర్కొంది. అయితే మొదట్నుంచి స్పిరిట్ పవర్ ఫుల్ పోలీసు కథ అని.. ఇందులో డార్లింగ్ పోలీసు పాత్ర చేయనున్నారని ప్రచారం సాగింది. ఇదో ఇంటర్నేషనల్ సిండికేట్ జానర్ లో తెరకెక్కుతుందని తెలిసింది. కానీ, తాజా రిపోర్ట్ మాత్రం దీనికి పూర్తి విరుద్ధంగా ఉంది. దీంతో ఫ్యాన్స్ షాక్ అవుతున్నారు. ఆల్రెడీ ప్రభాస్ ప్రస్తుతం రాజాసాబ్ చేస్తున్నారు. ఇది కామెడీ హర్రర్ జానర్ లోనే తెరకెక్కుతుంది. అలాంటింది బ్యాక్ టు బ్యాక్ రెండు ఒకే జానర్ సినిమాలు ఎందుకు చేస్తాడని ప్రశ్నిస్తున్నారు. అయితే ఈ స్టోరీపై గతంలోనే దర్శకుడు సందీప్ చెప్పారు. ఇది శక్తిమంతమైన పోలీసు కథ అని అన్నారు. కానీ, లేటెస్ట్ బాలీవుడ్ రిపోర్ట్ మాత్రం ఇందుకు భిన్నంగా ఉండడంతో ఫ్యాన్స్ చిన్న కన్ ఫ్యూజన్ లో పడ్డారు.కాగా, ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ త్రిప్తి డిమ్రి హీరోయిన్ గా నటించనుంది. ఇటీవలే ఆమెను ఎంపికచేస్తూ.. మేకర్స్ అధికారికంగా ప్రకటన చేశారు. ఇర భద్రకాళీ, టీ సిరీస్ బ్యానర్లపై ప్రణయ్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీత దర్శకుడిగా వ్యవహరించనున్నారు. ప్రస్తుతం డైరెక్టర్ సందీప్ ప్రీ ప్రొడక్షన్ పనులు, స్క్రిప్ట్ పనుల్లో బిజీగా ఉన్నారు. ఇక షూటింగ్ పై త్వరలోనే క్లారిటీ రానుంది.





యాషిక ఆనంద్ అప్రయత్నంగా చిక్ ఆల్-బ్లాక్ ఎన్‌సెంబుల్‌లో స్టన్స్



అన్ను చీరలో చక్కదనాన్ని పునర్నిర్వచించింది

# ఆడింది 5 వన్డేలే.. ప్రపంచ రికార్డు బద్దలు కొట్టిన సఫారీ బ్యాటర్!

- వన్డే క్రికెట్‌లో సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించిన మాథ్యూ బ్రీట్జ్కే
- ఆడిన తొలి ఐదు వన్డేల్లోనూ 50కి పైగా పరుగులు చేసిన తొలి ఆటగాడిగా ఘనత
- ఇంగ్లండ్‌తో రెండో వన్డేలో 85 పరుగులతో రాణించిన సఫారీ బ్యాటర్
- లార్డ్స్‌లో అత్యధిక వన్డే స్కోరు నమోదు చేసిన దక్షిణాఫ్రికా ఆటగాడిగా మరో రికార్డు
- నాలుగు వికెట్లతో సత్తా చాటిన జోఫ్రా ఆర్చర్



దక్షిణాఫ్రికా యువ బ్యాటర్ మాథ్యూ బ్రీట్జ్కే వన్డే క్రికెట్‌లో సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. ఆడిన తొలి ఐదు వన్డే మ్యాచుల్లోనూ 50కి పైగా పరుగులు చేసిన ప్రపంచంలోని ఏకైక ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. గురువారం లార్డ్స్ మైదానంలో ఇంగ్లండ్‌తో జరిగిన రెండో వన్డేలో ఈ అరుదైన ఘనతను అందుకున్నాడు. అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ ఈ మ్యాచ్‌లోనూ చెలరేగి ఆడాడు.

ఈ మ్యాచ్‌లో బ్రీట్జ్కే 77 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 85 పరుగులు సాధించాడు. దూకుడుగా ఆడుతూ సెంచరీ దిశగా సాగుతున్న అతడిని ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ ఒక అద్భుతమైన బంతితో ఔట్ చేశాడు. దీంతో బ్రీట్జ్కే తన రెండో వన్డే శతకాన్ని త్రుటిలో చేజార్చుకున్నాడు. అయినప్పటికీ, లార్డ్స్ మైదానంలో వన్డేల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేసిన దక్షిణాఫ్రికా ఆటగాడిగా మరో రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. గతంలో ఈ రికార్డు హెర్షెల్ గిబ్స్ (74) పేరిట ఉండేది.


ఇప్పటివరకు కేవలం ఐదు వన్డేలు మాత్రమే ఆడిన బ్రీట్జ్కే, 92.60 సగటుతో మొత్తం 463 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, నాలుగు అర్ధ సెంచరీలు ఉన్నాయి. అతడి అత్యధిక స్కోరు 150 పరుగులు. వరుసగా ఐదు మ్యాచుల్లో 50కి పైగా స్కోర్లు చేయడం ద్వారా జాంటీ రోడ్స్, క్వింటన్ డి కాక్, హెన్రిచ్ క్లాసెన్ వంటి దక్షిణాఫ్రికా దిగ్గజాల సరసన నిలిచాడు.ఇక మ్యాచ్ విషయానికొస్తే టాస్ గెలిచిన ఇంగ్లండ్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. దక్షిణాఫ్రికాకు ఓపెనర్లు మార్‌క్రమ్ (49), రికల్టన్ (35) మంచి శుభారంభం ఇచ్చారు. ఆ తర్వాత బ్రీట్జ్కే (85), ట్రిస్టన్ స్టబ్స్ (58) అర్ధ సెంచరీలతో రాణించారు. చివర్లో డెవాల్డ్ బ్రెవిస్ కేవలం 20 బంతుల్లోనే 42 పరుగులు చేయడంతో దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 330 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఇంగ్లండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ 4 వికెట్లు పడగొట్టగా, ఆదిల్ రషీద్ 2 వికెట్లు తీశాడు.

# ఆ విషయం అతడికి చెప్పి ఉండాల్సింది: మిచెల్ స్టార్క్




దఆస్ట్రేలియా దిగ్గజ బౌలర్ మిచెల్ స్టార్క్ టీ20లకు మంగళవారం (సెప్టెంబర్ 2న) వీడ్కోలు పలికాడు. వన్డేలు, టెస్ట్ క్రికెట్‌పై మరింత దృష్టి నిలిపేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అతడు ప్రకటించాడు. అయితే ఈ విషయాన్ని అతడు.. ఆస్ట్రేలియా టీ20 క్రికెట్ జట్టు కెప్టెన్ మిచెల్ మార్ష్‌కు చెప్పడం మరిచిపోయానని వాపోయాడు. అతణ్ని మన్నింపు కూడా కోరాడు. 'టీ20 ఫార్మాట్‌లో నేను రిటైర్మెంట్ ప్రకటించబోయే విషయాన్ని హెడ్ కోచ్ ఆండ్రూ మెక్‌డొనాల్డ్, నా సహచర బౌలర్లు పాట్ కమిన్స్, జోష్ హేజిల్‌వుడ్‌తో చర్చించాను. అయితే ఆస్ట్రేలియా టీ20 జట్టు కెప్టెన్ మిచెల్ మార్ష్‌కు సమాచారం అందించలేదు. నేను అతడికి ఈ విషయం చెప్పి ఉండాల్సింది. తాను ఇన్‌స్టాలో చూసి టీ20ల్లో నా రిటైర్మెంట్ గురించి తెలుసుకున్నానని మెసేజ్ చేశాడు. నేను ఈ విషయమై చింతిస్తున్నాను. నేను కెప్టెన్‌కు ఓ మాట చెప్పి ఉండాల్సింది. నన్ను మన్నించు మిచెల్ మార్ష్' అని మిచెల్ స్టార్క్ వాపోయాడు. ప్రస్తుతం స్టార్క్ ఆస్ట్రేలియా తరఫున రెండో లీడింగ్ వికెట్ టేకర్‌గా ఉన్నాడు. అతడు 65 టీ20 మ్యాచుల్లో 79 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అలాగే 127 వన్డేల్లో 244, 100 టెస్ట్ మ్యాచ్‌ల్లో 402 వికెట్లు తీసుకున్నాడు. స్టార్క్ 2021 టీ20 వరల్డ్ కప్ గెలిచిన ఆసీస్ జట్టులోనూ సభ్యుడు. అతడు చివరిసారిగా 2024 టీ20 వరల్డ్ కప్‌లో కనిపించాడు.స్టార్క్ పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిన వెంటనే, ఛైర్మన్ ఆఫ్ సెలక్టర్స్.. జార్జి బెయిలీ తన స్పందనను తెలిపాడు. 'స్టార్క్ టీ20ల్లో ఆసీస్ కోసం ఎంతో చేశాడు. ముఖ్యంగా 2021 వరల్డ్ కప్ విజేతగా నిలిచిన ఆస్ట్రేలియా జట్టులో సభ్యుడు. అలాగే అతడో అద్భుతమైన బౌలర్. వికెట్లు కూల్చడంలో అతడి నైపుణ్యం అమోఘం' అని జార్జి బెయిలీ కొనియాడాడు.

# రింకు స్థానంలో దూబె బెటర్.. ఇదే కారణం: మాజీ క్రికెటర్



ఫార్మాట్‌లో ఆల్‌రౌండర్లే కీలక పాత్ర పోషిస్తారని భారత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా వ్యాఖ్యానించాడు. అందుకే, ఆసియా కప్ కోసం తుది జట్టులో ఎక్కువ మంది అలాంటి ప్లేయర్లే ఉండాలని సూచించాడు. లోయర్ ఆర్డర్‌లో వచ్చే బ్యాటర్‌పై అధిక బాధ్యత ఉంటుందని.. ఆ ప్లేయర్ బౌలింగ్‌లోనూ రాణిస్తే జట్టుకు చాలా బలమని వ్యాఖ్యానించాడు. అందుకే, ఫైనల్ XIలో రింకు సింగ్‌కు బదులు శివమ్ దూబెను ఏడో స్థానంలో ఆడించాలని సూచించాడు.

"తుది జట్టు ఎలా ఉండాలి? అన్నప్పుడు చాలా అంశాలు ప్రభావితం చేస్తాయి. ఆల్‌రౌండర్ జాబితాలో హార్దిక్ పాండ్య ఎలానూ ఉంటాడు. జితేశ్ శర్మకు చోటు ఇవ్వాలంటే రింకును పక్కన పెట్టాలి. అప్పుడు ఏడో స్థానంలో రింకు సింగ్‌ను ఆడించకుండా.. అతడికి బదులు శివమ్ దూబెను తీసుకోవాలి. రింకు సింగ్ అద్భుతమైన ఫినిషర్ అనడంలో సందేహం లేదు. కానీ, ఇటీవల దేశవాళీతోపాటు ఐపీఎల్‌లో గొప్పగా ఏమీ రాణించలేదు. అవసరమైతే బౌలింగ్‌లోనూ దూబె అక్కరకొస్తాడు" ఆకాశ్ చోప్రా వ్యాఖ్యానించాడు. సెప్టెంబర్ 10న భారత్ తన తొలి మ్యాచ్ యూఏఈతో ఆడనుంది. ఆ తర్వాత పాక్‌తో 14న, ఒమన్‌తో 19న తలపడనుంది.

**కుల్‌దీప్ ఉండాల్సిందే..: మదన్ లాల్**

"ఆసియా కప్‌ను టీమ్‌ఇండియా కైవసం చేసుకోవడం ఖాయమే. ఇందులో ఎలాంటి అనుమానం లేదు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, అఫ్గానిస్థాన్ జట్లలో అఫ్గాన్ మినహా మిగతా వాటి ప్రదర్శన ఏమాత్రం గొప్పగా లేదు. పాకిస్థాన్‌కు అఫ్గాన్ నుంచి ప్రతిఘటన తప్పదు. అయితే, భారత జట్టు ఎంపిక విషయంలోనే ఇప్పుడు పెద్ద వివాదం నడుస్తోంది. శ్రేయస్ అయ్యర్ వంటి ప్లేయర్‌ను పక్కనపెట్టడంతో విమర్శలు వచ్చాయి. ఇప్పుడు కేవలం తుది జట్టు కూర్పుపైనే టీమ్‌ఇండియా దృష్టి పెట్టాలి. ఇద్దరు స్పిన్నర్లు, ముగ్గురు పేసర్లతో బౌలింగ్ ఎటాక్ ఉండాల్సిందే. అందులోనూ కుల్‌దీప్ యాదవ్‌కు చోటు కల్పించాల్సిందే. అతడు విన్నింగ్ బౌలర్. కుల్‌దీప్ బౌలింగ్ శైలి దుబాయ్ పిచ్‌లకు నప్పుతుంది" అని మాజీ క్రికెటర్ మదన్‌లాల్ తెలిపాడు.

**CITIZENS TIMES TELUGU DAILY** Printed, Published and Owned by M.S.R.PATNAIK, D.NO.44-22-15/1, Near Ramalayam Veedhi, Rly New Colony,visakhapatnam-530016, Printing at Padmaja Printing Press, D.No.44-22-15/1, Near Ramalayam Veedhi, Rly New Colony, Visakhapatnam-530016, Andhra Published D.No.44-22-15/1, Near Ramalayam Veedhi, Rly New Colony, Visakhapatnam-530016, Chief Editor SANDEEP KUMAR, Cell No: 99664 47776 **RNI No: APTEL 28868/2009**